రాతిస్తంభము.

(కల్పితనాటకము.)

పానుగంటి లక్ష్మీనరసింహారావుచే

రచియింపఁబడినది.

మొదటికూర్పు 1000 ప్రతులు.

పిఠాపురము

శ్రీ విద్వజ్జన మనోరంజనీ ముద్రాక్షరశాలయందు

ముద్రింపఁబడియె.

1930.

కాపీరైటు రిజిస్టర్డు]

[వెల 0-10-0

రాతిస్తంభము.

(కల్పితనాటకము.)

పానుగంటి లక్ష్మీనరసింహారావుచే
రచియింపఁబడినది.

మొదటికూర్పు 1000 ప్రతులు.

పిఠాపురము
శ్రీ విద్వజ్జన మనోరంజనీ ముద్రాక్షరశాలయందు
ముద్రింపఁబడియె.

కాపీరైటు రిజిష్టర్డు] 1930. [వెల 0-10-0

పీ ఠి క.

—:•:—

ఇది నాయిరువదిమైదవ నాటకము. దీనిలోని కథ కల్పితము. నన్నుఁ బోషించు శ్రీ శ్రీ పీఠికాపురాస్థానమహారాజావారి ధనసాహాయ్యమున దీని నచ్చువేయించితిని. శ్రీ శ్రీ మహారాజావారికి వారి కుటుంబమునకుఁ బరమేశ్వరుఁడు సకలశ్రేయముల నిచ్చి సర్వదా రక్షించుఁగాక.

ఈనాటకమునకు నాందీప్రస్తావనలను వ్రాసియిచ్చిన బ్రిహ్మశ్రీ కూచి నరసింహముగారి కనేక నమస్కారములు.

పీఠికాపురము.

వా॥ ల॥ నరసింహారావు.

ఇందువచ్చు పాత్రములు.

పురుషులు.

నారాయణరావు—కథానాయకుడు.

ఇద్దరు రక్షకభటులు.

వైద్యుడు.

కృష్ణుడు—నారాయణరావుకొడుకు మూడేండ్లవాడు.

వరసయ్య—నారాయణరావునకు బొరుగున నున్న బ్రాహ్మణుడు.

Etc.

స్త్రీలు.

లక్ష్మి—నారాయణరావుభార్య.

వెంకమ్మ—నారాయణరావుతల్లి.

చంద్రరేఖ—నారాయణరావు వేశ్య.

నాగి—వేశ్యమాత.

అచ్చి—లక్ష్మియింటిలో దాసి.

సోమి—వేశ్యయింటిలో దాసి.

Etc.

శ్రీరామా !

రాతిస్తంభము.

నాంది.

క. మావన్మానవదుష్పా
పావళిఁ ద్రుటిఁ ద్రుంప వారి ♦ సముతప్తులుగాఁ
గావించి ప్రోచు నలల
క్ష్మీశవీక్ష యొసంగుఁగాక ♦ మీకు శుభంబుల్ !

(నాంద్యంతమున)

సూత్రధారుఁడు—నటీ !

నటి—(ప్రవేశించి) ఏమి సెలవు ?

సూత్ర—శ్రీ పానుగంటి లక్ష్మీనరసింహారావుకవిగారి యిరువదియైదవ నాటక మగు “రాతిస్తంభము” ప్రదర్శనోన్ముఖముగా నున్నదా ?

నటి—ఆ ! ఆప్రయత్నములోనే యుండఁగా మీపిలుపు వినఁబడి వచ్చినాను.

సూత్ర—పతి పిలువఁగనే వచ్చుట యీలువు గల యిల్లాలి ముఖ్యలక్షణము గాదా ! బహుకారణములచే నిది ప్రశస్యమైన నాటకము.

నటి—కపటగణికాసంభాషణములును, మద్యమత్త ప్రలాపగీతములును వేశ్యామాతృకృత సమ్మార్జనీప్రహారములును, జక్కఁగా వర్ణింపఁబడి యుండుటచేతనా ?

సూత్ర—అవియుఁ గారణములే, కాని గౌణకారణములు.

గీ. చిత్తశోభను హెచ్చించు ♦ చిత్రఫలక
పృష్ఠనీలప్రదేశంబు♦రీతి, నవ్వి
గ్రంథసత్పాత్రసద్గుణ♦రామణీయ
కంబుఁ జేయు మఱింత హృ♦ద్యంబుగాను.

నిమ్మపంటిచాయ గల మేనిమిసమిసలు హెచ్చగుట పచ్చచీర గట్టినప్పుడా? నల్లచీర గట్టినప్పుడా?

నటి—అది కాంతాసౌందర్యగ్రహణపాండితీసంపన్ను లగు తమకుఁ దెలియును గాని వెఱ్ఱిబాగులదాన నగు నా కెట్లు తెలియఁ గలదు? ఇది పరమపతివ్రతాశిరోమణి నాయికగాఁ గలనాటకము కనుక లఘుప్రసంగములు రానీక, యుక్తప్రశంసావాక్యములతోఁ బ్రస్తావన నడపుట మంచి దని మనవిచేసికొనుచున్నాను.

సూత్ర—అట్లైన వినుము.

శ్రీరామనామంబుఁ ♦ జిత్తంబునను జిహ్వ
నెలకొల్పి కీర్తించి ♦ యలరె నెవతె,
పతిని బ్రత్యక్షదై♦వతముగా భావించి
తద్దుష్టశీలంబుఁ ♦ దలఁప దెవతె,
జగతిలోఁ గోడండ్రి♦సరణిని బోవక
సేవించి యత్త రం♦జించె నెవతె,

సంసారపంకసం•సక్త గాకుండఁ, గు
మ్మరపుర్వుకైవడి • మనియె నెవతె,
యాసతీమణి, లక్ష్మీసు•మాఖ్య, సర్వ
సుగుణముల కాటపట్టైన • సుందరాంగి,
విష్ణుభక్తాగ్రగణ్య, సా•ధ్వీమతల్లి
ప్రణుతిపాత్రి మీనాటక•పాత్రములను.

నటి—సత్యమే. పతి కష్టతోఁ బ్రాణములఁ దీయుపోటు పొడిచినప్పుడుగూడ నాహా! ఆయిల్లాలు నమస్కరించి పోయినది గాని యొకతిట్టైనఁ దిట్టలే, దొకమూలుగైన మూల్గలేదు.

సూత్రి— గీ. పశుగుణము పోదు ప్రతిపశు•వర్తనమున
నాత్మతేజంబుచేతనే • యణఁగుఁగాని;
నిప్పు పోవదు మఱియొక•నిప్పువలన
నంబువులచేత నద్ది చ•ల్లారుఁగాని.
చెడుగు వేఱొకచెడుగుచే • నుడుప నెంతు
వేసి, యింకొకదుష్కృతిఁ • బృథ్విఁ జొన్పు;
దండుచే శాంతినే యది • యడఁచివైవు
మంచు బుద్ధుఁడు ప్రజకు బో•ధించినాఁడు.
తన్నుఁ గొఱుతను వేయు పా•తకులఁ జూచి
"యెఱుకలేనట్టి వీరి క్ష•మింపు తండ్రి!"
యంచు జీజస్సు దేవుఁ బ్రా•ర్థించెఁ గాని
వనరలే దింతయును లోనఁ • గినియలేదు.

ఇది చెఱకునకుఁ దీపివలె, మంచునకు శైత్యమువలె, మల్లెపూవునకుఁ బరిమళమువలె, నంబకపత్యప్రేమవలె, శుద్ధసత్త్వగుణ

సంపన్నులై యుండు నెల్లకాలములందలిమహాత్ములకును, మహాత్మురాండ్రకును సహజప్రకృతి.

నటి—అంత శాంతమూర్తియై పాప మామె యీప్రపంచమున నేమి సుఖ మనుభవించినది?

సూత్ర—పామరదృష్టి నేమియు లేదుకాని, సుఖదుఃఖతత్త్వరహస్య మెఱిఁగిన మహాయోగులకుమాత్ర మలౌకికమైన యామె యాత్మానందము గోచరింపఁగలదు.

గీ. రోఁత గలిగించునెరువు భూ♦జములందు
మధురరసఫలవితతిగా ♦ మాఱునట్లు
పరహితైషణ శ్రీరామ♦భక్తులందు
బాధ లెల్ల సుఖములుగాఁ ♦ బరిణమించు.

నటి—ఆలాగునా? అదిగో ఘంటానాదము వినఁబడుచున్నది. లక్ష్మమ్మ పాత్రము ప్రవేశించుచున్నదికాఁబోలు. ఇఁక మనము పోవుదము రండు!

(ఇద్దఱు నిష్క్రమింతురు.)

కూచి నరసింహము.

శ్రీరామా !

రాతిస్తంభము.

ప్రథమాంకము.

ప్రదేశము—రాజానగరము.

ప్రవేశము—లక్ష్మి.

లక్ష్మి—సంసారము బాగుపడు నను నాశ లేదు. ఏమి చేయవచ్చును ? ఇదివఱ కెన్నిసారులో బతిమాలుకొంటిని. భగవంతుఁడా ! తండ్రీ! నీయిష్టమెట్లో యట్లే జరుగుఁగాక ! ఏపూర్వజన్మకర్మఫలమో యనుభవించుచున్నాను. కిక్కురుమనకుండ ననుభవింపవలసినదే. ఇఁక నాభర్త వేశ్యయింటినుండి వచ్చువేళ యైనది. పాదప్రక్షాళనమున కుదకము సిద్ధపఱుపవలయును.

(నిష్క్రమించును.)

(నారాయణరావు ప్రవేశించును.)

నా—వేశ్యారక్తి కలిగిన రసజ్ఞునకు సంసారపుజంజాట ముడఁగూడదు. ఈదిక్కుమాలిన సంసారపుగొడవ మోహపాశసంబంధానుభవమునకు నిరోధకమే—యాముష్మి[illegible] నిరోధకమే— అందుకొఱకే సంసారమును బంధ[illegible]యని పెద్దలు చెప్పినారు. కట్లు—దిక్కుమాలినకట్లు—తెగ

కానికట్లు—ఈసంసారమున నెన్నియైన నున్నవి. ఒకమూల భార్య. ఒకమూల తల్లి. ఈమె ధుమధుమ. ఆమె రొసరొస. ఒకకట్టున్నప్పుడే మనోవైశాల్యమున కవకాశము లేనప్పుడీరెండుకట్లున్నఁ జెప్పవలయునా ? కాళ్ళకొకకట్టు, చేతులకొకకట్టుచాలక దిక్కుమాలినభగవంతుఁడు కొడుకు నొక్కని నిచ్చి గొంతుకకుఁగూడ నొకకట్టు కట్టినాఁడు. ఇక్కడికిఁ బ్రపంచదుఃఖమునకుఁ బరమావధి యన్నమాట. అక్కడకుఁ గదలిక గలవాఁడను గావున లక్ష్యపెట్టక కొట్టుకొనివచ్చుచున్నాను. ఈసంసారములోనున్న పెద్దచిక్కు—నేను గనిపట్టినదేదనఁగా—సంసారమును మనము లక్ష్యముచేసినకొలఁదియు, నాదరించి యడఁగియున్నకొలఁదియు నది మీఁది కెక్కి కాలిక్రింద మనలను ద్రొక్కుచు. ఎంతసేపు వినినది విననట్లుండవలయును— చూచినది చూడనట్లుండవలయును. ఏదియు దరికి రాకుండ దులిపివైచుకొనవలయును. "నళినీదళగత జల" మని చెప్పినవాని యభిప్రాయ మిదియే యని తోఁచుచున్నది. ఎంత దులిపివైచికొని—యెంతదూరముగా నుండఁ బ్రయత్నించినను సాగదు. పనికిమాలినప్రపంచధోరణి యట్లున్నది. ఉదయము, సాయంకాలము నింటికి రాకతప్పదు. రాకపోయిన యెడలఁ దల్లియు గోలయే— పెండ్లాము గోలయే— ఈగోలఁ జూచి యిరుగుపొరుగయ్యాకొయ్యాలు నమ్మలక్కలు నూరెగిరిపోయినంత యల్లరి— ఏమి ? వారిసొమ్ము నాకేమైనఁ బెట్టుచున్నారా ? నాసొమ్ము నేను దగులఁబెట్టుకొన్నయెడల వారి యేడు పెందులకు ? నాభార్యయొద్ద నేను బండుకొనకున్న యెడల నూరిపేరటాండ్రగోల యెందులకు ? నాభార్య—పాప

ము— అది యంతగా నేమియు ననవే యనదు. దానికి లేని దేవులాట వీరి కెందులకో— దిక్కుమాలినప్రపంచము— సిగ్గు మాలిన ప్రజలు. నో రెత్తినయెడల మూఁతిమీఁదఁ దన్న వలసినది.

(లక్ష్మి ప్రవేశించును.)

లక్ష్మి—నాథా! నమస్కారము. వచ్చితిరా! పాదప్రక్షాళనమునకు నీ రిదిగో తెచ్చినాను. కాళులు గడిగెదను.

నారా—ఇప్పుడు నీకొలకు జోడు విప్పనా? కాళులు వలదు— చేతులు వలదు. శుద్ధచ్ఛాందసురాలవు. ఇంటికి వచ్చుసరికిఁ జీఁపురుకట్టతోను, పేడనీళ్లతోను సిద్ధమగుదువు. నాకుఁ గాళ్లకు నీళ్ళక్కఱలేదు.

లక్ష్మి—కాళ్లైనఁ గడుగుకొనకుండ భోజనముచేసెదరా?

నారా—నాకు భోజన మక్కఱలేదు.

లక్ష్మి—ఎందుచేత?

నారా—గడియక్రిందటఁ గడుపునిండ గారెలు దిన్నవాని కిప్పుడు భోజన మేల?

లక్ష్మి—ఎక్కడఁ దిన్నారు?

నారా—ఈనడుమ కావేరిసానికిఁ గాకినాడకోమటి కన్నెఱికము చేసినాడుకాదా? అందుకొఱకుఁ గావేరి మా కందఱకు విందు చేసినది.

లక్ష్మి—అట్లైన దానియింటిలోనే భుజియించినారా?

నారా—అదిగో-తిరుగఁ దగవుఁదెచ్చిపెట్టినావా? అది యంటని-యిది మైల యని, మనము బ్రాహ్మణుల మని, వారు వేశ్య లని యారంభించినావా?

లక్ష్మి—మనము శ్రోత్రియకుటుంబములోనివారము కామా? వారు వండినది మీరాక తినుట తప్పుకాదా?

నారా—నాకు వండలేక సద్గృహుబ్రాహ్మణుఁడు వండితెచ్చినాఁడు. ఇంటిలోఁ గూర్చున్న నీ కీతర్జనభర్జన లెందులకే? ఈమడిమైల రాద్ధాంతము లెందులకే? మగవారు—వీథిలోనికిఁ బోవలసిన వారు—పదిమందిలోఁ దలయెత్తుకొని తిరుగవలసినవారు—అవసరానుసారముగా వారివారి సాంఘికవ్యాపారములను జక్కఁబెట్టుకొనువారు—అట్టివారు వారియిష్టానుసార మేదో చేయుదురని తటస్థముగా నూరకుండవలయును గాని యాఁడుదానికి మగవారివీథిగొడవ లెందుకు? విందులగొడ లెందుకు? వారాంగనలయింటిలో మనము తినఁగూడదా? ఎక్కడినీతి యిది? ఏపురాణములో నున్నది? ఏధర్మశాస్త్రములో నున్నది? ఉండనీ—ఉండకపోనీ! గ్రంథాలగొడవ మన కక్కఱలేదు. ఆచార మెట్లున్నది? ఈశ్రోత్రియకుటుంబములవారిలో వేశ్యాంగనల యింటిలో విస్తరి వేయనివా రెవరు? వేశ్య లనఁగా నీకంటికి నలుకుగుడ్డ పెంటచేటవలెఁ గనఁబడుచున్నారు కాఁబోలు! వీరి పూర్వోత్తరములు నేను జెప్పెదను విను—సముద్రమథనకాలమందుఁ బుట్టిన యప్సరస్త్రీలలోఁ గొందఱు పైలోకమునకుఁ బోయినారు—కొందఱు భూలోకకల్యాణముకొఱ కిక్కడనే యున్నారు—వారు లక్ష్మితో సమానమైన దేవత లన్నమాట! తెలిసినదా? వారిలో బ్రాహ్మణాదివర్ణవిభాగము లేదు—వారి చేతిప్రసాద మమృత మన్నమాట. వారు మహీమండలమంగళదేవతలు. వారిని నిందించినవారికిఁ గన్నులు చిల్లులువడును.

లక్ష్మి—నాథా! వారిని నే నేమియు ననలేదు.

నారా—నన్నుమాత్ర మనుట యెందులకు? ఏమధ్యాహ్నమో, యే సాయంకాలమో యింటఁ దప్పదుకదా యని దినమున కొక మాఱు నే నింటికి మెతుకులకొఱకు వచ్చినప్పుడు, నీవో, మాయమ్మయో యేవో సూదుమాట లాడుట యెందులకు?

(వెంకమ్మ ప్రవేశించును.)

వెంక—ఏమిరా! అది ని న్నెప్పుడైన సూటుమాట లాడెనా? ఇల్లాలు— మహాసాధ్వి— తిట్టిన సహించినది— తన్నిన సహించినది. కొట్టిన సహించినది. నీముండకొఱకు తనయొడలిమీఁదిగుల్ల లిచ్చినది. ఒక్కనాను పోఁచతో నున్నది. లోకోత్తరగుణసంపన్నమైన యాబంగారుబొమ్మను సూటుమాట లాడుచున్నావని మందలించుచున్నానా? ఇఁక నేను నిన్నుఁ దిట్టఁదగనా? కన్నదానను నీకు బుద్ధిచెప్పఁ దగనా? మాన్యముఁ దగులఁ బెట్టి దానియెదానఁ బెట్టితివే? 'నీకొడుకు భాగమును వేరు చేసి నీభాగ మమ్ముకొనరా' యని నేను నీకాళ్ళపైఁ బడి చెప్పితినే— ఊరివారిచేతఁ జెప్పించితినే. నీ విన్నివిధముల సంసారమును భ్రష్టపఱచినందులకు ని న్నేమి చేసిననైనఁ బాపమున్నదా?

నారా—అమ్మా! నీ కిష్టమైనయెడల నింటికి వచ్చెదను. లేదా— ఇది కూడ మానుకొందును.

వెంక—వచ్చి నీవుచేయుచున్న ప్రయోజకత్వ మేమి? నిక్షేపమువంటి యిల్లాలితోఁ గష్టము సుఖము—మాట మంతి— యేమైనఁ జున్నవా? కానరానికొడుకు—నీతండ్రిపేరు పెట్టుకొంటిమి. ఆముద్దు వానిని నొక్కసారి బుజమున నెత్తికొంటివా? నీవు వాని నెత్తికొనఁగఁ జూడవలయు నని నాకు ముచ్చట కాదా? అదియ

మా—బెడిద మని యక్కైవచ్చుట—పట్టుబట్ట చుట్టఁబెట్టుకొనుట—ముంగాళ్లపైఁ గూర్చుండి మూఁడుమెదుకులు ముక్కున కంటించుకొనుట—హల్లుహల్లు మనుచుఁ బిలుపునకైన నంద కొండ ముండయింటికిఁ బోవుట—ఈమాత్రమున కింటికి రాక పోయిన నేమి? ఫో!

లక్ష్మి—(అప) అత్తా! అంతకఠినములైనమాట లెందులకు? ఆయన దయయుండి వచ్చినప్పుడే నాకుఁ బండుగ. రావలదని యనుట యెందులకు?

వెంక—(అప) నీమెత్తఁదనముచేతనే వాఁడు పాడైనాఁడు. నీయోగ్యతను గాపాడుకొనుటకే నీవు చూచుచున్నావు కాని వానిని నిరోధించి బాగుచేయవలయు నని నీవు చూచుచుండుట లేదు. కొంతకఠినఁదనము వహించి యెదురుతిరిగి నిర్భయముగ నాతనిని నిరోధించినఁ గాని యతఁడు బాగుపడఁడు. అట్లు భర్త నెదిరించుట నీకుఁ బరమార్థలోప మని సంశయించుచున్నావు. అది తప్పు. భార్య గురుస్వరూపయై పనికిమాలినభర్తను శిక్షింపవలయును. అట్లు చేసినఁగాని నీకు మోక్షము లేదు. వానికి మోక్షము లేదు.

నారా—అమ్మా! ఒక్కప్రాణమను. మీరు ముగ్గురు. మీకు నన్నుఁగూర్చి యింతకంటక మెందుకు? నాకు శరీరములో రోగము ప్రవేశించినది. అమ్మా! నీకంటె నేనే ముందేమో? నన్నెందు కల్లరిపెట్టుదురు. నామూలమునఁ జంద్రరేఖ కల్లరి యెందులకు? ఇక్కడనుండి కదలనులే. ఇక్కడనే స్థావరమునై, యిక్కడనే పాఁతుకొని యుందునులే— మీకన్నులు చల్లఁగా నాకు భూశయన మిక్కడనే చేయుదురుగాని లే—

వెంక—నీ మొగము—నీమోర. స్థావరము లేదు—జైనవిగ్రహము లేదు. దర్భశయ్య లేదు—పూలరథమువంటి భార్యయొద్ద సుఖముగాఁ బండుకో! పిల్లవానిని మీ రిద్దఱుఁగూడ నడ్డముగా గుండెల మీఁదఁ బెట్టుకొని పండుకొనుఁడు. స్వచ్ఛమైన యిల్లాలితో నున్న సుఖము, కడుపారఁ గన్నబిడ్డను మెడమీఁదఁ బెట్టుకొని యెగురులాడిన సుఖము నెఱిఁగిన ముండకొడు కెవ్వఁడైన, క్రుళ్లుగుడిసె వ్రేటుముండపడుకగదిపాయిఖానాపెరటిలోనికిఁ బోవునా? బుద్ధిహీనుఁడవై పోయితివి—పూవులతోఁ బూజింపఁ దగిన యిల్లాలియెడల మహాపచార మొనర్చితివి. లెంపలు వైచుకో—లే—అన్నమునకు రా—

నారా—నేను రాను.

వెంక—ఎందుచేత?

లక్ష్మి—అత్తా! గోదావరిసాని యఁట. కోమటయ్య కన్నెఱికముఁ జేసినందుకు విందుచేసినదఁట.

నారా—గోదావరి కాదు-నీ మొగము-కావేరి. అయినను నీ కాగోడవ యెందుకే?

వెంక—యజ్ఞశాలలో వేదఘోషమునడుమ సోమపానముఁ జేసిన మీతండ్రికడుపున నీవు పుట్టి కన్నెఱికపుగదిలో ఫలాహారములు చేసితివా? (అప) లక్ష్మీ! నేను బోవుదును. నీవు రవంత బోధింపుము. అవసర మగునెడలఁ గన్నెఱ్ఱచేయుము. (పోవును.)

లక్ష్మి—నాథా మీయమ్మగారన్నమాటలకు మీ రిబ్బందిపడవలదు. ఆమె పెద్దది. ఆమె మనకు బుద్ధులు చెప్పఁదగినది. లోకమంతయుఁ బ్రతిష్ఠ వ్యాపింపఁజేసిన మీతండ్రిగారు కైలాసగతు

లైనారుకదా! వారివంశమర్యాద వీరును కాపాడకపోయిన యెడల నెవ్వరు కాపాడుదురు? అయ్యో! వంశకీర్తి పోవుచున్నదే యని యాందోళనముచేత నామె దేవులాడుచున్నది. తల్లిమాట వినుటకంటెఁ గొడుకు చేయఁదగిన దేమున్నది?

నారా—ఎంతసేపు సొమ్ముపోయినది-సొమ్ముపోయిన దని యొక్కటే గోల-తల్లిముండలకు చావుసమీపించుచున్నకొలఁది ధనవాంఛ హెచ్చగును. ఈడునికిమాలిన సొమ్మెవ్వానికి శాశ్వతమో చెప్పు. రెక్కలువచ్చి దానియంత నది యెగిరిపోవుచుండఁగా నే నేమి చేయవలసినది?

లక్ష్మి—పోయినసొమ్మునకు మానము విచారింపవలదు. మీమీఁద నది దిగదుడు పని యనుకొందము. ఇంతటినుండియైన మీరింటి యొద్దనే యుండి, భవతారకసాధన మైన మాతృసేవఁ జేయుచు, నల్లారుముద్దైన పిల్లవానిని బెంచుకొనుచు, నతిథిసేవఁ జేసికొనుచు గృహకృత్యములు నిర్వహించుకొనుచు నుండవలయు నని ప్రార్థించుచున్నాను.

నారా—నాకుఁగూడ నింటియొద్దనే పండుకొనవలయు నని యుండును. అదేమికర్మమో—రవంతసేపైన బుద్ధి నిలువఁబడదు. ఏమి చేయుదును?

లక్ష్మి—అప్పు డేమి చేయుదు రనఁగా—నిలువఁబడి, రెండుచేతులు జోడించుకొని ‹‹ శ్రీరామచంద్రమూర్తీ! నీవు పితృవాక్యపరిపాలకుఁడవు: ఆశక్తిలో సహస్రాంశము నాకుఁ బ్రసాదింపుము. నీ వేకపత్నీవ్రతుఁడవు. ఆశక్తిలో లక్షాంశమైన నాకుఁ బ్రసాదింపుము-రామా! నీలమేఘశ్యామా! నీవు నిశ్చలహృద

యుండవు. అరిషడ్వర్గసంహర్తవు—ఆశక్తిలోఁ గోట్యంశమైన నాకుఁ బ్రసాదింపుము. ఇట్లొనర్చుటయేగాక—నాతండ్రీ! నీపాదారవిందములయందు సంతతమైన భక్తి నాకుఁ గటాక్షింపుము. ఓం శాంతిశ్శాంతి" యని భగవంతుని ధ్యానింపుము. ఏమి-నేను జెప్పినట్లు చేయుదురా ?

నారా—(పలుకకుండ గుఱ్ఱుతీయును.)

లక్ష్మి—అయ్యో! అప్పుడే నిద్రించినాఁడే. (లేచి చేతులుజోడించుకొని పాడును)

కీర్తన.

జయజయ రాఘవ జానకిరామ్-రఘుకులరాఘవ రాజారామ్
రావణమారక రాఘవరామ్-రఘుకులదీపక రాజారామ్
నీరధిబంధన రాఘవరామ్-మారుతిసేవిత రాజారామ్
దశరథనందన రాఘవరామ్-దానవభంజన రాజారామ్
మునిసవనావన రాఘవరామ్-పురహారపూజిత రాజారామ్
మంగళగుణగణ రాఘవరామ్-మంజులభాషణ రాజారామ్
పతితపావన రాఘవరామ్-భక్తినొసఁగుమా రాజారామ్
జానకిరంజన రాఘవరామ్-జన్మవిభంజన రాజారామ్.(జయజయ॥)

నాథా! నాథా! వేశ్యయింటికిఁ బోకుండ నిచ్చటనే పండుకొంటివిగదా! నాయింటి కిప్పుడు కళవచ్చిన ట్లున్నది. నాకంటి కిప్పుడు దృష్టివచ్చిన ట్లున్నది. సుఖముగాఁ బరుండుకొనుము. నిన్ను లేపను. నాథా! మనపిల్లవాఁడు పుట్టి మూఁడుసంవత్సరములైనదికదా! అప్పటినుండియు నీవు నన్ను స్పృశింపలేదే. తిన్నగాఁ గంటనైనఁ జూడలేదే. నీ వీమూఁడు సంవత్సరము లొడలు తెలియని మహానందమునఁ గులటతోఁ గులికిపోయితివే.

నీవు వేశ్యాలింగనసుఖ మనుభవించుచుండఁ బ్రమాదమున నైన నొక్క క్షణకాల మైన నన్నుఁ దలఁచితివా? నాపాలిటి నారాయణమూర్తి వగు నీనామమును స్మరించుకొనుచు నేఁ గాలక్షేపము చేయుచుంటినిగదా! పోనీ! నీవు సుఖపడిన యెడల నాకుఁ జాలును. నీలో నేను జీవించియున్నప్పుడు నీసుఖమే నాసుఖము కాదా? నన్ను మందలింపు మని, బెదరింపు మని, కోపింపు మని, సాధింపు మని మాయత్తగారు నాతోఁ జెప్పినారు. నిన్నొక్కమాటయైన నే ననఁజాలను. నేను వయస్సులోనున్న పెండ్లామును గాదా! అదిగో! నోరెఱుఁగని పసిపాపఁడు కాఁడా! నాథా! నీవు మమ్ముద్ధరింపవలయు నని వేర నేను జెప్పవలయునా? నేను జెప్పుటకు నీవు తెలియనివాఁడవా? నాయదృష్టము బాగగునప్పుడు భగవంతుఁడు నీకే తోఁపింపఁడా? పోనీ. దైవేచ్ఛయే జరుగుఁగాక! ఐహికకష్ట మెంత కాల ముండును? నేఁడో రేపో వెడలిపోవునప్పుడీమాత్రము నకై యిహలోకదైవ మగు భర్తను దూలనాడుదునా? పుణ్యము లేమసరికదా- ఈపాపముమూట నాతోఁగూడ నెందులకు? నాథా! మూఁడేండ్లనుండి నీపాదము లొత్తుభాగ్యము నాకుఁ గలుగలేదు. (భర్తపాదములను కన్నుల కద్దుకొని) ఇప్పుడీవిధముగా ఋణవిముక్త నగుచున్నాను. ముప్పదియాఱుమాసములనుండి నేను నీస్పర్శసుఖ మెఱుఁగను. (ముద్దుగొని) ఇదిగో ఇదియే చాలు. ఇఁక నాలుగేండ్లు నిన్ను దాఁకకున్నను నాకు బెంగలేదు. నే నిఁకఁ బండుకొందును.(పిల్లవానిని దొట్టెనుండి తీసి తనప్రక్కలోఁ బండఁబెట్టుకొనును.) నాతండ్రీ! నీనాయనగారు మనపుణ్యమున నీరాత్రి యిచ్చటనే పండుకొన్నారు.

నాయనా! నీవు పుట్టినతరువాత నాకు సుఖమిన మిదియే. నేను ను బండుకొందును. రామా. రామా. (పండుకొనును.)

నారా—(నిమ్మళముగ లేచి) నేను నిద్రపోవుచున్నా నని యేదో పనికిమాలిన దైవప్రార్థన చేసినది. దానితో నా కసహ్యాము వైచినది. తరువాత నేదియో నోటిలో గొణగుకొన్నది. కాళులు కన్నుల కద్దుకొన్నది. ముద్దొక్కటి పెట్టుకొన్నది. ఈ ముద్దు నాపుట్టిముంచినది. నాభార్యయొక్కఁ బండుకొనకపోవుటయే కాక యొకరి నొకరు ముద్దిడుకొనమని నేను జంద్రరేఖయొద్దఁ బ్రమాణము చేసితిని. దీనిముండమోయ- దీని మూలమున నిప్పుడు నావ్రతమునకు భంగము కలిగినది. నేను ముద్దుఁబెట్టుకొన్న యెడల నాది దోసము కాని యది యట్లు చేసినయెడల నాదోష మేమున్న దని కొంత సమర్థించుకొన వచ్చును. సమర్థనవఱకు వచ్చినదా నాకర్మము? మాయమ్మ నన్నుఁ దిట్టినందువలన నే నిక్కడఁ బండుకొంటి నని వీరియభిప్రాయమై యుండును. నేను బుద్ధిపూర్వకముగా నే పండుకొంటిని. సారాయంగడివానికిఁ జంద్రరేఖ నలుబదిరూపాయలవఱకీయవలసియున్నది. వాఁడు దానిని గారాగృహమం దుంతు నని బెదరించుచున్నాఁడు. దానిమర్యాదఁ గాపాడుటకు నేను గాక మఱెవ్వరున్నారు? నూర్లకొలఁది నిచ్చెద నని గిరగిర యింటిచుట్టు తిరిగిన సరసులను సాగనంపి నన్ను నమ్ముకొన్న దానిపరువు నేనే కాపాడవలసియున్నదికాదా. నాయిల్లాలిమెడలో నింక మిగిలియున్న నాను దీసికొనిపోవ నిక్కడఁ బండుకొంటిని. అడిగినయెడలఁ దప్పకుండ నిచ్చును. ఇదివఱ కెన్నియో గుల్లలిచ్చిన కారణమున నడుగుటకే మన స్సొప్పకపోయి

నది. అందులోను నాకు మోమోటము యింతయంత కాదు. అందుచేత దొంగతనమే శరణ్యమైనది. నాసొమ్ము నేను దీసికొనుటలోఁ దప్పులేదు కాని — అయినను బుద్ధిమాలినప్రజలు కాదా? ఎంతసేపు తప్పెన్నుటయందే వారికి ముచ్చట. (భార్య మెడలో నాను దీసికొనును.) ఇది యట్టె బరువుగాఁ గనఁబడదు. ఇది చాలకపోయినప్పుడు తిరుగ నద్దెయద్దె యని సొమ్మునకెక్కడకుఁ బరుగెత్తవలసినది? పిల్లవానిచేతి యొత్తులుగూడఁ దీసికొందును. (తీసికొనును.) అదిగో! ఒత్తులు పెట్టినస్థలమునఁ జేయి రవంతసన్నగిల్లి యున్నదే. పాపము. ఇవి తీసివైచితిని గాని చేతులు పాడైపోవలసినది. చంద్రరేఖ వీథిగుమ్మములో నాకొఱకుఁ గనుపెట్టుకొని యుండును. త్వరగఁ బోవలయును. వీథితలుపు తీసికొని పోవుదును. ఎవరో దొంగలు వచ్చి యీ వస్తువులు హరించుకొనిపోయినా రని ప్రతీతి కల్గును. ఏదో జరుగును. ముందేమి జరుగునో యనుచింత యెందులకు?

(నిష్క్రమించును.)

ఇది ప్రథమాంకము.

శ్రీరామా !

రాతిస్తంభము.

ద్వితీయాంకము.

ప్రదేశము—చంద్రరేఖయిల్లు.

ప్రవేశము—నారాయణరావు, చంద్రరేఖ, (సారాబుడ్డిచేతులతో).

చంద్ర—చచ్చినవెధవా, చచ్చినవెధవ యొక్క నాను దీసికొనివచ్చితివా? చచ్చునాను— పాతికరూపాయలైన రాదయ్యెను.

నారా—పిల్లవానియొత్తులుకూడ నున్నవి కాదా?

చంద్ర—ఏవీ! ఇంక నాచేతిలోఁ బెట్టవేమి? అవి నీవమ్ముకొని త్రాగవలయు నని యనుకొంటివా యేమి?

నారా—ఇవిగో (ఇచ్చును).

చంద్ర—(తీసికొని) ఇది యేమి? ఇత్తడివస్తువులే! ఓరి నీగొంతు గోయ— బంగారపువస్తువు లని చెప్పి నన్ను మోసపుచ్చెద వఁటరా?

నారా—ఆఁ! ఆఁ! నన్ను క్షమింపుము. నే నెఱుఁగను. నన్నాముండ మోసపుచ్చినది.

చంద్ర—నీపెండ్లామే నా?

నారా—అవును.

చంద్ర—దానిసిగ గోయ. ఎంతమోసకత్తెయో ?

నారా—ఇంటికిఁ బోయి దానిని జెప్పు తీసికొని తన్నెదను. తెల్లనిది వెండి, పచ్చనిది బంగార మని నాయూహామే కాని యింత మోస మున్న దని నే నెఱుఁగుదునా ?

చంద్ర—నీ వొకటియెఱిఁగి యేడ్తువా ? ఏమియు లేదు. పట్టెదద్దమ్మ వు. భార్య పతివ్రత యని కొనియాడెదవు. నీభార్య యో గ్యత యిప్పుడు తెలిసినదా ? మూఁడేండ్లనుండి మహాపతివ్రత నీకొఱకుఁ గనుపెట్టుకొని యున్నది. సిగ్గుమాలిన మొగమా ! మూల నున్న యత్తముండ ముసలిదయ్యెను. తోఁటలో బా లుఁడు మూరెఁడుకంటె నెక్కువ లేఁడయ్యెను. అమ్మగారికి రాత్రి యిల్లంతయు సర్వేభ్యము. అందులో బాపనముం డలు! ఇదిగో మీయాఁడువారు వీధినిబడినతరువాతనే కాదా మావృత్తులన్నియు మన్నుగలసిపోయినవి. మూఁడేండ్లనుండి ముసుఁగుఁ బెట్టుకొని ముడుచుకొని మూలఁ గూర్చున్నదా ? ఛీ ! అంతదీక్షతోఁ గనుపెట్టుకొని యుండుటకు తెలివితక్కువ చంద్రరేఖ కాదు.

నారా—దానిరూపము సామాన్యముకాని యున్నవిశేషము యోగ్య తయేకాదా !

చంద్ర—నీవు చచ్చినఁగాని చంద్రరేఖను స్తుతింపవు. అందుకు నోరు రాదు. రాజుగారిప్రధానుఁడు నాకు మాన్య మిచ్చెద నని వార్త చేసినాఁడా ? నే నేమంటిని ? అప్పుడు నీవు నాయొద్దనే యుంటివికాదా ? చెప్పు—గుటకలు మ్రింగుచు గ్రుడ్లుపెట్టు కొని చూతు వేల ?

నారా—మాన్యము కాదు—అగ్రహార మిచ్చినసరే నారాయణరావును

కఠినమైన యీశరీరమును దుద కర్పింపవలసిన దగ్నికే యని
వార్త నంపితివి.

చంద్ర—ఆమాటలో నర్థము బుద్ధిహీనుండవైన నీకుం దెలియకపోయెను గాని లోకమంతయు నట్టుడికిన ట్లయిపోయినదే! అసంగతి యటుంచుము. తుసికోమటి రాత్రి కైమువంద లిచ్చెదనని వార్త నంపినాండుకదా—దినమున కైమువందలచొప్పున సంవత్సరమునకు రెండులక్షలరూపాయలు రాబడి యైనదా? పెద్దజమీందారీ యన్నమాటయేనా? నే నేమంటిని? చెప్పుం. మన మిద్దఱమే కాదా?

నారా—కోమటిమొగము నీజన్మమునం జూడ నని యంటివి.

చంద్ర—చెప్పితినైన నాయోగ్యత నీవు గ్రహింపంగలవా? అది యటుండనీ-నీభార్యవస్తువులు దెమ్మని నన్ను నీయింటికిం బంపియుంటివా? పుట్టిమునుంగవచ్చినది కావునం బాపవలసివచ్చినది. ఏమి చేయను? నాకర్మము. ఆండుదియై పుట్టంగూడదు. అందులో వేశ్యయై పుట్టంగూడదు. మఱి యందులో నీతిగల వేశ్యయై పుట్టంగూడదు.

నారా—ఆపుట్టిమున్క యేమి! ఏమి!

చంద్ర—సారాపాటదారునకు నలుబది బాకీకాదా? ఆబాకి నేను గొట్టివేసెదను నామాట యేమన్నావని చెట్టుక్రింది న్యాయవాదిచేత వార్తనంపినాండు. అందుచేత నీకుం దొందర యియ్యవలసివచ్చినది.

నారా—ఆః! ఆం! ఎంతపొగరు? లంజెకొడుకు!

చంద్ర—ఆతనితప్పేమున్నది? నేను వేశ్యను గాదా. అందుచే నందఱకు లోంకువయే. బట్టలుండికిన. చాకివాండు కన్నుగీంటె.

గుడ్డెలు గుట్టిన జంగమువాఁడు కన్నుగీఁటే. అద్దెకు బండిగట్టిన దర్జీయ్యాకూడఁ గన్నుగీఁటే. ఏమున్నది? నాబ్రతుకు కిట్లున్నది. పోనీ! నీబ్రతు కేమైన సరిగా నున్నదేమో యని యనుకొనఁగ—నిత్తడి యొత్తులతో సిద్ధమైన పెద్దమ్మవు. నీవు నాకేమి చేయఁగలవు? పోనీ—నీపై మమకారము వదలుకొంద మన్న నాతరము గాదు—నన్నుఁ బుట్టించిన బ్రహ్మదేవునితరము కాద య్యెను. ఎక్కడఁ జావుమంటివి? నీతోఁ బెద్దపుట్టిమునుక వచ్చినది!

నా——నీవిశ్వాసము, నీయోగ్యత నే నెఱుఁగక పోలేదు. నీవు నాకొఱ కెంతస్వార్థపరిత్యాగ మొనర్చినది గుర్తింపక పోలేదు. నాచర్మముతో నీకు ముచ్చెలు కుట్టించినను నీఋణము తీర్చుకొనలేను. నాభూమి నీ కిచ్చితిని. నాయిల్లు నీదే యయ్యెను. ఇంతకంటె నే నేమి యీయఁగలను?

చంద్ర——నీభూమి నా కిచ్చితి వని నీవు దేవులాడ నక్కఱలేదు. నీకుఁ గావలసినయెడలఁ దిరుగ వ్రాయించి యిచ్చెదను. తీసికో. క్రిందటిసంవత్సరము పండలేదు. పన్ను దండుగ యిచ్చుకొంటిని. ఈసంవత్సరము పండునో యెండునో తెలియదు. దినము లెట్లు గడచునో యని భయముగా నున్నది. నీ వీకఁ బదుకటింటి కక్కఱకువచ్చువాఁడవే కాని వంటయింటి కక్కఱకు వచ్చువాఁడవు కావు. నా కాసంగతి తెలియును. పోనీ, నీభార్య నెవరికైన నప్పఁజెప్పి యేదో యుద్యోగము సంపాదించుకొని నన్నుఁ బోషింతు వేమో యని చూడఁగ నిల్లా లరుంధతి యై మొగదిగఁ బొగడుచుండు నయ్యెను.

నారా—నీవు నన్నట్టె మందలింపవలసిన పనిలేదు. నేను నిన్నెటు లైనఁ బోషింతును.

చంద్రి—సరే చూతము. నీ వెక్కడికిఁ బోవుదువు? నే నెక్కడికిఁ బోదును? చూడు-నీ వింటికిఁ బోయితివికదా, నీవు నీభార్య యొద్దఁ బండుకొంటివా ?

నారా—నాభార్యయొద్దఁ బండుకొనుటా ? హే. హే. హే ! ఇదిగో! ఈమీసముఁ జూచినావా ! అన్నమాటకుఁ దిరుగన్నఁడైన నుండెనా ?

చంద్రి—పోనీ ! నీభార్య నిన్నేమైనఁ గదల్చినదా ?

నారా—పాపము—లేదు.

చంద్రి—మగఁడవయ్యేను-మూఁడేండ్లకింద దానియొద్దఁ బండుకొంటివయ్యేను-నీవు రాత్రి దానిగదిలో నుంటివయ్యేను—తిరిగి యిటకు రావలసినవాఁడవయ్యేను. నిన్నామె యెందులకు స్పృశింపలేదో యిప్పటికైన నెఱుఁగుదువా ?

నారా—నా కిష్టము లేకపోవుటచేత నేను దొంగనిద్రపోయితిని. నన్ను లేపుట కామె కిష్టము లేకపోయెను. అక్కడికిఁ బాపము నన్ను వదలలేక నాదొంగనిద్రలోనే నన్ను బుగ్గమీఁద ముద్దుపెట్టుకొన్నది.

చంద్రి—అయినదా ? ఇఁక నీవ్రతము మండిపోను. ఎందు కామీసము ? గొరిగించుకో.

నారా—నాతప్పులేదు కాదా ?

చంద్ర—ఏ దౌడమీఁద ముద్దుపెట్టుకొన్నది ?

నారా—ఇదిగో—ఈకుడి దౌడమీఁద.

చంద్రి—ఆదౌడ గాడిదెమూత్రము పెట్టి కడిగి, పిడక నిప్పుపెట్టి

కాల్చి, యీదొడ్డనెపు పంక్తిని యీడదీయించుకొన్నఁ గాని యది పనికిరాదు. మూఁడేండ్లదిక్కు కుక్కనుబట్టుకొనిపోయి నదా ? ఏమి వలేకపోయినావు.

నారా—నే నప్పు డేమి వనే యేడ్చినాను. మించిపోయినదాని కేమి చేయవలసినది? నే నింక మీయింటి కెన్నఁడును బోను. ఇది ప్రమాణముగాఁ జెప్పినమాట. ఈప్రమాణము మీఱినయెడల నీవు నన్నెంతపనిచేసినను నే నొప్పుకొందును. ఈసారిమాత్రము తప్పినయెడల మీసాలే కాదు, బుఱ్ఱకూడ గొరిగించుకొందును.

(నేపథ్యమున) చెంద్రీ! మంగలి వచ్చినాఁడు.

నారా—పీనియిల్లు వల్లకాడుగాను. వీఁ డెపుఁడో సమయానికే వచ్చినాఁడు.

చంద్ర—బుడ్లు తెచ్చినాఁడా ?

(నేప.) ఆఁ.

వేశ్యమాత—(ప్రవేశించి) ఇదిగో. (బల్లమీఁదఁ బెట్టును) (అప) సారాపాటదారుఁ డొక్కపావుగంటలో వచ్చెద నని మంగలితోఁ జెప్పినాఁడఁట. ఈదరిద్రపుముండకొడుకు నావల కీడ్చివేయుము.

చంద్రి—(అప) పోనీ. ఏవో మాటలు చెప్పి నీవసారాలోనికిఁ దీసికొనిపోఁగూడదా ?

వేశ్యమా—(అప) ఊహు.

చంద్రి—(అప) దెంద్రయ్యాయన నీకొఱకు వచ్చినాఁడా యేమి ? :

వేశ్యమా—(అప) ఆగొడవ నీకెందుకు— వీనికి గొంతుకవఱకు సారా పోసినయెడల నేవో వెఱ్ఱికేకలు పెట్టును. ఆవంకపెట్టి

యావలికి గెంటి తలుపువైచికొందము. పాటదారుఁడు రాకుం డనే యీశవ మావలికిఁ బోవలయును.

చంద్ర—(అప) సరే నడు. (వేశ్యమాత నిష్క్రమించును.)

చంద్రి—నారాయణరావు! నీరసముగా నున్నావేమి? కునికిపాట్లు పడుచుంటివేమి?

నారా—ఈరాత్రి భోజనము చేయలేదు.

చంద్రి—(పాత్రిలో సారాపోసి) ఇదిగో! ఒకపట్టు పట్టు.

నారా—(త్రాగును.) చేవు. (తేంచును.) బాగుగనే యున్నది. గాటు గానే యున్నది. ఆగాటులో మోతాదైన కమ్మఁదన మున్నది. అంతేకాని గొంతుకలో వెఱ్ఱిమంట లేదు. గొంతుకలోనికి జరజర సాపుగా దిగిపోయినది కాని యెక్కిలికాని యెగుఁపుకాని యేమియు లేదు.

చంద్రి—మఱియొకవంపు వంపవోయి.

నారా—అక్కఱలేదు. నరములకు చుఱుకైన గమనిక, కదలిక కలిగినవి. చంద్రోదయమైనట్లు స్వచ్ఛముగాఁ గనఁబడుచున్నది. ప్రకృతియంతయు క్షౌరముచేయించుకొన్నట్లు నునుగ నున్నది.

చంద్రి—ఇఁక రెండుపీల్పులు పీల్పవోయి పెద్దమ్మా!

నారా—(త్రాగును.)

చంద్రి—ఇప్పు డేలాగున నున్నది?

నారా—ఆ— (దీర్ఘముగా సుతివేయును.)

పదము.

సానిదాని దెచ్చినాఁడు సంతలోఁ బెట్టినాఁడు
గోనెగుడ్డ గప్పినాఁడు కోకకొంగు లాగినాఁడు—
వాః వారేవాః వారేవాః

ఇదిగో మీసము. పదునల్గురు ముండల నుంచుకొంటిమను. హె. హె. హే. తమాషా (తూలుచున్నాఁడు.) ఉండరా లంజెకొడుకా! మీఁదఁ బడెద వేమిరా? ఆఁగు. అక్కడనే యాఁగు. తాగి తెయితక్కలాడుదువా?

చంద్రి—ఏమి యాయల్లరి? నారాయణా! అవలికిఁ బో.

నారా—నేను బోను. నేను బోను. పొమ్మనుట కెవ్వని కధికారము లేదు. నాకొంప నాగోడి—నాదూడ నాడుడికి—నాయిల్లు నావాఁకిలి. నీ వాఁడుదాన వైనయెడల నేను మగవాఁడను. మగవానికి మీస మెంతడాబో యాఁడుదాని కదిగో! అది యంతడాబు—హెహెహే! దానిపై రెండులకుఁ దలపెట్టలేదో మొఱుఁగుదువా? అసభ్యము—ఎవరికి? చదువుకొన్న నపుంసకపుముండకొడులకు— హే హే! మాకు పుంస్త్వవృద్ధికి మందెందులకు?

చంద్రి—పో— అవలికిఁ బో.

నారా—దండాలు. నీపాదాలకు దండాలు. నీయమ్మకడుపు చల్లగా, నీయత్తకడుపు చల్లగా వేయేండ్లు వర్ధిల్లు. బ్రాహ్మణులమానాలన్ని వేసికో— వేసికో నీసిగగోయ. అమ్మవారిజాతరకు సిడిబొమ్మను ద్రిప్పినట్లు గిరగిరద్రిప్పినయెడల—ఓ—అంకులరాట్నమంత సొగసు. (తూలుచున్నాఁడు.) ఎక్కడఁ జూచిన నెత్తువల్లమే కాని సాపైనవారియే కనఁబడదేమి? ఎవఁడురా నన్ను ముందుకుఁ ద్రోయుచున్నాఁడు? ముండకొడుక! డొక్క చీల్చి కాలు గొట్టెదను.

చంద్ర—అమ్మా! నీ పీతనిచేయి పట్టుకొని యావలికిఁ దీసికొనిపొమ్ము. (వేశ్యామాత ప్రవేశించి నారాయణరావుచేయి పట్టుకొనఁబోవును.)

ద్వితీయాంకము.

నారా—వారేవా, వారేవా.

పదము

నెత్తిమీఁద ముగ్గుబుట్టాయె నాసామి
కంటిలోను ప్రత్తికాయ
మేఁకలాగునఁ జిన్నగడ్డం నాసామి
కాకిబొడ్డు మేనిరంగు
నోటిలోను జుట్టపీకాయె నాసామి
గుండెమీఁద గంగడోలు
వీపుక్రింద నులకకుక్కాయె నాసామి
కుక్కక్రింద కంటికుక్క

హాహా. చూచినావా! సరస్వతివి! గ్రామ్యభాషాసరస్వతివి నీవే! నీయాశ్రితులము మేము నాకవితాధార కనిపట్టితివా. ఇంతధార గంగాప్రవాహమువలె నాకెవ్వరికుఁ గలిగినదో యెఱుఁగుదువా? వేశ్య నుంచుకొనువేళ—అది నాదికేను కు—హా హా హా—కాళిదాసున కెవ్వరికుఁ గలిగినది? ధూర్జటికవి కెవ్వరికుఁ గలిగినది? నిజమైనకవితాధార గలయందఱకుఁగూడ సానిసంపర్కము తప్పక తద్దినములాగునఁ దప్పదు. ఒక్కటే శాసనము. కైలాసము మొదలుకొని రావణాసురుని కాష్ఠమువఱకు

వేశ్య—నీవు మాటలాడక నాతో రా. (లాగును.)

నారా—నీతో రానా! నీతల్లిపిండ నీ స్నేహితుడ. నావయస్సు స్నేహితుడ! ఎంతయేతము పెట్టుగాఁ జెప్పినావు! దేంతరి సుబ్బన్నమాట యేమి చెప్పినావు? సాటిలి అబ్బాయిమాట యేమి చెప్పినావు? వా రిద్దఱను వదలుకొంటి నన్న మహాశాసనము

వ్రాసి న్యాయసభలోఁ బెట్టి దర్భశయ్య వేసికొని పండుకో. అప్పుడు నాపౌరోహిత్యము. జీవప్రాయశ్చిత్తము చేయింతునో కాక గర్భాధానపుమంత్రమే చెప్పుదునో నాతమాషా!

చంద్రి—అమ్మా! త్వరగ సాగనంపవేమి? నీవుకూడ వినోదము చూచుచుంటివా యేమి?

వేశ్య—నీ వల్లరి చేయుచున్నావు. వీథిలోనికిఁ బో! లేనియెడలఁ జీపురుతోఁ గొట్టెదను.

నారా—చీఁపురుతో నీవు నన్నుఁ గొట్టినయెడల నేను జెప్పుతోఁ గొట్టనా? ఆమాత్రపుఁ బౌరుషము లేదనుకొన్నావా? నీముండమోయ. రా. కట్టు- కాసెకోక కట్టు- రా. నాపంజాబీ మైసూరీ తడాఖా చూతువుగాని. (దండమీఁదఁ గొట్టుకొనును.) పట్టు. ఇదిగో, ఈలాగున నోడుపుపట్టు— కోడిపంజెపుఁగాపు చూడలేదా? నే నట్లు కాపు కాచితిని. నీ వ్రొత్తిగిల్లు. అయ్యో! నీతల గొరగ. ఒత్తిగిల్లవేమి? (తన్నును.)

వేశ్య—ఓరిగాడిదకొడుకా! ఎంతతన్నుఁ దన్నితివిరా— నీకాలు తెగిపోను. (చీఁపురుకట్టతోఁ గొట్టును.)

నారా—అమ్మ నీగొంతుగోయ! పర్వతమును వజ్రాయుధముతో దేవేంద్రుఁడు గొట్టినట్లు కొట్టితివే. ఎ ప! తెక్కలూడలేదుగాని యెక్కళ్లుమాత్రము వచ్చినవి. ప.ప! కొట్టినదెబ్బ గుండె కెగఁదట్టినది. ప ప! వస్త్రాలు లేవేమో, యెక్కడను మంచినీళ్లు దొరకకుండ నున్నవి. ఎంతసామంతమైనను జిగురుసారాజె. నాలుక పీకికొనఁదగిన ట్లున్నది. తాటికల్లు—యీఁతకల్లున్న వే— ఇవి రొట్టకొట్టు— పాటకపుజాతికొఱకు. బ్రాహ్మణునకు మాత్రము చిగురుసారా పెట్టినది పేరు. వడికి తగ్గులేదు. విలు

వను హెచ్చులేము.. అది యగ్రజాతి కన్నివిధముల చేతఁ దగి నది. ఇఁక జమీందార్లు! అబ్బ! నిప్పుకోళ్లు! వారిత్రాగుడు ముందు మాది చచ్చు—చచ్చుము ప్రాతిక—సరాసరి! సీమబుద్ధికిబుద్ధి యొక్కగుర్రిక్కలో వంపుపెట్టినజమీందారుఁ డున్నాఁడే— అతనిబ్రదుకే బ్రదుకు— బ్రహ్మజ్ఞానికి దేహాభిమానముండదు. అతనికి నుండదు. ఒడలు చీరినసరే— తగులఁబెట్టినసరే.

చంద్రి—అమ్మా! ఇఁక రెండుకొట్టి యావలి కీడ్చివేయక చూచెదవేమి?

వేశ్య—(చీపురుతోఁ గొట్టును.)

నారా—ఆహాహా! బ్రహ్మాస్త్రప్రయోగ మొనర్చుచున్నది.

(వేశ్యమాత గెంటుచున్నది. నారాయణరావు గుమ్మమున కావల క్రిందఁ బడును. వేశ్య తలుపు వైచుకొనును)

నారా—(లేచుటకుఁ బ్రయత్నించి లేవలేక రెండుసారులు పడి లేచును.) దీనిని జంపి చాకిరేవుబల్లమీఁద సారాపోసి యరుగఁదీసి యరుగఁదీసి యరుకులమునకుఁ బుట్టినముసలమునువలె గోదావరిలోఁ గలిపెదను. అంతమట్టుకు సంకల్పించుకొన్నఁగాని పనిజరుగదు. వేశ్యాకులమున కెల్ల నిదే కీడు. ఈకీడు దీసిన ఖ్యాతి నాకుఁ గలుగవలెను. ఎవఁడో నాయొద్దకు వచ్చుచున్నాఁడు.ఎవఁడవురా నీవు—నీయూరేదిరా—నీపేరేదిరా? డొక్క చీల్చి రాలు గొట్టెదను.

(ఒకరక్షకభటుఁడు ప్రవేశించి యీలవైచును.)

నారా—అదిగో. ఆలాగున సుతిపట్టు. ఇఁక నామేజువాణి చిత్తగించు.

(మద్దెలకు దండముపెట్టి రక్షకభటునకు దండముపెట్టును.)

రాతిస్తంభము.

కీర్తన—కాంభోజి.

ఉన్నమగతన మెన్న సున్నకుసున్నైన
వన్నెల చిన్నెల నెన్నఁదరమటే!

(పాడి యభినయించును.)

నాతినను భవింపఁ జేతగానినీకు మూతిపైమీసాలు ప్రేతపైఁబూవులె॥
ఉన్న॥

సుతివాఁడితి వెందుచేత? నెత్తిమీఁద టంగునఁ దాళపుచిప్పతోఁ గొట్టెదను. (రక్షకభటుని నెత్తిపైఁ గొట్టును.)

(రక్షకభటుఁడు వానిని బట్టుకొన యత్నింప నతఁడు పరుగెత్తును. ఇంతలో మఱియొకరక్షకభటుఁడు ప్రవేశించును.)

2 ర—బ్రాహ్మణుఁడా! నీ వెవఁడవు?

నారా—నేను జంద్రరేఖమగఁడను.

1 ర—చంద్రరేఖ కెంద ఉన్నారో— వారిలో నీ వెవఁడవు?

నారా—వాచాదోషములు. జాగ్రత్త. మూతిపైఁ గొట్టెదను.

2 ర—అయ్యయ్యో! ఇతఁడు మన పెద్దశాస్త్రులుగారికొడుకురా!

1 ర—ఎవఁడైన నేమి- కొట్టులో నుంతము.

నారా—నన్నుఁ బట్టుకొందురా? ఏది పట్టుకో— (పరుగెత్తిఁబోవును. తూలి క్రిందఁ బడిపోవును.)

2 ర—రామరామా! పనియిల్లు నే నెఱుఁగుదును. అక్కడకుఁ దీసికొనిపోదము. పట్టుకో— మన కెప్పటిఋణసంబంధమో!

(ఇద్దఱు పట్టుకొని నిష్క్రమింతురు.)

ఇది ద్వితీయాంకము.

శ్రీరామా!

రాత్రిస్తంభము.

తృతీయాంకము.

ప్రదేశము—నారాయణరావుగృహము.

ప్రవేశము—మంచముపై వెంకమ్మ, క్రింద లక్ష్మి.

వెంక—ఇంకను లేవలేదా?

లక్ష్మి—లేచి భుజియించి తిరుగఁ బండుకొన్నారు.

వెంక—ఈదుర్గుణముకూడ నున్నట్లు వినలేదు. ఇదికూడ నున్నదా? అయ్యయ్యో! ఎంతమంచివంశములో నెంతదుష్టుఁడు పుట్టినాఁడు! ఆమహాత్ము లదృష్టవంతులు కావున నీయవమాంగళ్యమును జూడకుండ వెడలిపోయినారు. నాతను వట్టిపోయినది కాదు. (తలపైఁ గొట్టుకొనును.)

లక్ష్మి—అత్తా! జబ్బుగ నున్నారు. మనస్సున కుద్రేకము తెచ్చుకొనకుఁడు. రోగము హెచ్చగును. భద్రముగా నుండవలయును.

వెంక—రోగము హెచ్చుకావలయు ననియే దేవులాడుచున్నాను. చావవలయు ననియే చేతులెత్తుకొని మొక్కుచున్నాను. ఇప్పుడు సాయంకాలము కావచ్చినదికదా.

లక్ష్మి—ఆఁ.

వెంక—ఇదివఱకు వచ్చిన జ్వరప్రవేశము వచ్చి యెంతసేపైనది?

లక్ష్మి—రెండుగంటలు కావచ్చినది.

వెంక—నీభోజనమైనది కాదా?

లక్ష్మి—అయినది.

వెంక—నీభర్త యుదయమునుండియు దానియింటికిఁ బోలే దేమి?

లక్ష్మి—ఏమీ? రెండుయామములవఱకు వెనుకటితిక్క వదలనే లేదు. లేచి స్నానముచేసి భుజముటతోడనే తిరుగఁ గునికిపాట్లు గాఁగఁ బండుకొన్నారు.

వెంక—కుఱ్ఱవాఁ డెచ్చట నున్నాఁడు?

లక్ష్మి—తోటలోఁ బండుకొన్నాఁడు.

వెంక—ఇంటిదాసి వచ్చినదా?

లక్ష్మి—వచ్చినది.

వెంక—ఈరాత్రి యిచ్చటనే పండుకొనుమని దానితోఁ జెప్పవలయునుజుమా.

లక్ష్మి—అత్తా! చెప్పితిని.

వెంక—ఉదయమున వచ్చిన వైద్యుఁ డేమన్నాఁడు?

లక్ష్మి—ధనుర్వాత మని యన్నాఁడు.

వెంక—అది యపాయకరమైన వ్యాధియే యని చెప్పినాఁడా?

లక్ష్మి—కొంతవఱకు నిమ్మళించిన దని చెప్పినాఁడు.

వెంక—దానికేమికాని యావైద్యుని రాత్రి యొకసారి రమ్మని చెప్పితివా?

లక్ష్మి—రాత్రి వచ్చెద నని యాతఁడే చెప్పినాఁడు. కాని యాతని మందు మీరు పుచ్చుకొనలేదుకదా— వైద్యుఁ డెందులకు?

వెంక—మందుపుచ్చుకొన్న యెడలఁ గుదురునేమో యనుభయముచేతఁ బుచ్చుకొనలేదమ్మా. వైద్యుఁడు రాత్రి యొకసారి వచ్చునెడల

నా ప్రాణోత్క్రమణసమయ మెప్పుడో చెప్పినయెడల నీవు జాగ్రత్తగా నుండఁగలవని—

లక్ష్మి—అత్తా! అదేమిమాట? మీకుమారుఁ డిక్కడనే యుండును గాదా?

వెంక—ఉండు నని చెప్పినాఁడా?

లక్ష్మి—లేదుకాని మీ కింత జబ్బుగానుండగా దానియింటికిఁ బోవ రనుకొందును.

వెంక—ఇంత కాదు. ఇంతకంటె శతగుణములు జబ్బుగానున్నను వాఁడు పోకమానఁడు.

లక్ష్మి—అదిగో మీకుమారుఁడు వచ్చుచున్నారు.

(నారాయణరావు ప్రవేశించును.)

నారా—నీకేమి మతియున్నదా లేదా? రెండవసారిపండుకొన్నప్పుడు రవంత లేపలేకపోయినావా?

లక్ష్మి—బడలియున్నా రని యూరకుంటిని. క్షమింపవలయును.

నారా—అమ్మా! ఏలాగున నున్నావు? మఱేమియు భయము లేదులే. ఊరక బెంగపెట్టుకొని యేడువకు. ఈముసలివాండ్రకుఁ జావనఁగ నింతయంత భయము కాదు. ఈధనుర్వాతరోగము పైకి భయంకరముగాఁ గనఁబడుటయే గాని యపాయకరమైన రోగము కాదు.

లక్ష్మి—తఱుచుగా నపాయకర మనియే వైద్యుఁడు చెప్పినాఁడు.

నారా—డబ్బుకొఱకు కల్లు చెప్పుదురు. వైద్యుల డాబుమాటలకు మోసపోవలదు. చంద్రరేఖతల్లి నాగిముండకు సరిగా నిదియే రోగము. ఒకదినముకాఁబోలు నులకకుక్కిమీఁద నున్నది. రెండవదినమున మొగ్గలాగున నింటిలోఁ దిరిగినది. ఇదివఱకే

లేక లేచి దేవలాడిన నాఁడసుగదా? ఇంకనైనఁ బోవలదా?
లక్ష్మీ! ఆ. ఆ. గట్టిగఁబట్టుకో!

(లక్ష్మికి ధనుర్వాతము వచ్చినది. నారాయణరావు లక్ష్మియు నామెను బైకి వంగనీయకుండ నొక్కియుంతురు. రెండు నిముసములకు యథాస్థితి నొందును.)

నారా—ఇక్కడి కీపాం గడఁగినది. తిరిగి రాత్రి యిట్లువచ్చునో లేదో చెప్పలేము. నిద్రపట్టినయెడల రాదులే. రేపటినుండి సుఖముగా నుండును. లక్ష్మీ! తలుపు వేసికో. వెళ్ళుదును.

లక్ష్మీ—(అప) అమ్మగారితోఁ జెప్పకుండఁ బోవుట తప్పుకాదా?

నారా—అమ్మా! నీకేమియు భయములేదు. నేను వెళ్ళుదును.

వెంక—నేను జావ నని శపింపకుము. నేను జావవలయునని యే కోరుకొనుచున్నాను. నన్నుఁ ద్వరగఁ దీసికొనిపొమ్మని మృత్యుదేవతకు మ్రొక్కుకొనుచున్నాను. ఎందుచేతనో యెఱుఁగుదువా? నీయవకతవక చూడలేక, నీయమంగళప్రవర్తన సహింపలేక, నీవలన నీవంశమునకుఁ గలిగిన యప్రతిష్ఠను భరింపలేకచచ్చుచున్నాను. నాచావునకు నీవే కారణమవు. ధనుర్వాతరోగము న న్నేమియుఁ జేయలేదు. మహామారియైన నన్నేమియుఁ జేయలేదు. నీకంటె నాకు మహామారి లేదు. మాతృహంతవైన నీమొగముజూడఁ బాపముకావునఁ బో—

నారా—అమ్మా! ఎందుకీ వెఱ్ఱిమాటలు? మొట్టమొదటినుండియు నీవు నన్నిట్లే వేధించుకొని తింటివి. ఇంటిలోఁ బో రూరకపోవునా? ఈకొంపకు వచ్చిన దరిద్రతకు నీవే కారణమవు. ఏమో పెద్దది. ఛాందసురాలు. ఆమెకుఁ దోఁచినమాటలు మంచిచెడ్డ లెఱుఁగక పేలుచుండును. ఆమెను ధిక్కరించుట

సీతీకా దని నేను నోసుమూసికొని యింతకాలము పడియుంటిని. నన్నూరకుండనీయవే! నానోరు పైట నేలవేయుదువు? డబ్బు లేదు, డబ్బులే దని యామూండ యక్కడ నన్నుఁ గోసికొని తినుచున్నందులకే యేడ్వనా? రాకరాక మెమకుల కింటికి వచ్చినప్పుడు నీవు నన్నుఁ గొడుకని—ప్రియుఁడని—నాపిండకూ డని—నల్లముముగనియు లేకుండ సాధించుచున్న సాధింపులకే యేడ్వనా? ఈబాధపడలేక, స్వంతతమైన యీఆంపపుఁగోత్ర కాఁగలేక యేదో రవంతసేపు మైమఱపుగా నుండునని, కాసం తసే పుత్సాహముగా నుండు నని నాల్గుచుక్కలు—వెగటుపడి వెగటుపడి—బలాత్కారమున గొంతుకలోఁ బోసికొనుచు న్నాను. అది యొకతప్పా? నాతలమీఁద నెగిరిపోయిన వా రెందఱందఱు త్రాగుచున్నారో యెఱుఁగుదువా? త్రాగినం దువలన గౌరవహాని యెవ్వరికి లేదు. త్రాగినందువలన నింకను గౌరవవృద్ధిమైనవారిని నే నెందఱనో యెఱుఁగుదును. యజ్ఞా దులుచేయు ముండకొడుకులు సోమపానము, సోమపాన మని చెడఁద్రాగి చెడద్రాగి శ్రోత్రియు లనిపించుకొనుటలేదా? సోమపత్రిరస మెట్టిదో, నాముత్రాఁడికల్లట్టిది. త్రాగనివా రెవ్వరును లేరు. ఉండుట కవకాశమే లేదు. మనమాట లెక్క యేమి? అవతారపురుషులకుఁ దప్పలేదు. బలరాముఁడు చెడఁ ద్రాఁగి తెలివితక్కు లాడలేదా? కృష్ణమూర్తి గొంతుకముడి వఱకుఁ ద్రాఁగి గంతులువేయలేదా? అమృత మమృత మని దేవతలు ద్రాఁగిన దేది? శుద్ధమైన కల్లు. (అప) లక్ష్మి! రాత్రి నీవస్తువులు హరించితి నని మీయత్తతోఁ జెప్పితివా?

లక్ష్మి—(అప) చెప్ప లేదు. చెప్పను.

—(అప) అదే మంచిపని. లేనియెడల నామె యాదుకొఱ కొక పెద్దగొడవ చేయును.

స్త్రీ—(అప) ఈరాత్రి మీరిల్లు కదలకుఁడు. ఎందులకైన మంచిది. భద్రముగా నుందము.

రా—(అప) ఏమి నీవెఱ్ఱి! ఈమె చచ్చిపోవు నని యనుకొనుచున్నావా? వట్టిమాట. ముసలివాండ్రకు సకాలమునఁ జావు వచ్చుట యెంత యదృష్టము! అట్టియదృష్టము పట్టదు. నే నెఱుఁగుదును.

స్త్రీ—(అప) పోనిండు. మఱెంత మంచిది—మీ రింటిలో నుండ రాదా? ఆమె మరణింపకపోయినను నే నొక్కతె నామెతోఁ బాట్లుపడఁగలనా? ఆమె కెగుపులువచ్చినప్పుడు నే నొక్కతె నడఁచిపట్టుకొనఁగలనా?

—(అప) మనయింటిలో దాసి నుండు మని చెప్పు. అది రాక పోవు నెడల నాగిచెల్లెలు సుభద్ర యనుమంతురసాని యున్నది. పిలిపి బంపెదను. ఏదో దాని కిచ్చెదము. అంతేకాని నీ వొక్కతె వుండు మని నేను జెప్పుదునా?

—వెళ్లినాఁడఁటే?

—లే దత్తా! ఇక్కడనే యున్నారు.

—వెళ్లకపోయితి వేల? నీకు భార్య కావలయునా? బిడ్డ కావలయునా? కన్నతల్లి కావలయునా? ఒక్కముండతక్క—నీ కేమియు నక్కఱలేదు. తల్లి కిక్కడ రోగము—కొడుకున కక్కడ భోగము. తల్లి కిక్కడ నేడ్పు, కొడుకున కక్కడ సంతోషము. తల్లి కిక్కడ భూశయనము— కొడుకున కక్కడ వేశ్యా

బాహుశయనము. తల్లి కిక్కడ నవసానగంగోదకపానము, కొడుకున కక్కడ సురాపానము. అది కాక—

నారా—అమ్మా! ఇన్నిమాట లింతపొందికగాఁ జెప్పినదానవు నీకు రోగ మేమిటి- నా శ్రాద్ధము. నీకు రోగ మనుకొన్నవాని రోగము. చావుచావని సులభముగా నందువు కాని యది నీ నెత్తి మంత పైపై నున్నదా- అమ్మా!

లక్ష్మి—(అప) నాథా! తల్లిగారి నట్లనుట తగునా? ఆమెచిత్తము నొవ్వఁదగదు.

నారా—(అప) చీ గాడిదా! నోరుమూసికో- నీకెందులకు?

వెంక—ఏమంటివిరా? పశువా! శుంఠా! నాది దొంగరోగమా? నే నెందుల కీదొంగతనము చేయవలయును? నీ వేక్కడ? నీ వెంత సౌభాగ్య మనుభవించుచున్నావో నేను నాదాసివి, లక్ష్మిస్వరూపమైన నెఱుఁగకుండఁ, బంపి కనుఁగొనుచున్నాను. అది తవఱకు మఱియొకనితోఁ గులికి కులికి హాస్య హాసనముల లికి నీయొద్దకు వచ్చి కాళ్లునొవ్వలని యది దొంగరోగ మభినయింప నీవు శ్రీరామనవమినాఁడు దానికాళు లొత్తలేదా? అదిగో! దేవతార్చనలోనున్న సీతారామమునకు జోడించవలసిన నీచేతులు—కన్నతల్లికాళులపై రాయవలసిననీచేతులు— పితృదేవతలతర్పణకాలమం దుపయోగపడవలసిన నీచేతులు— గుడిసె వేటుముండకాళులు పిసుకుటకు క్కఱకు వచ్చినవా? నీచేతులు తెగిపోను. నీతండ్రికంటె, నీతల్లికంటె, శ్రీరామ చంద్రమూర్తికంటె నదియే నీ కుత్తరగతిప్రదాత్రి యని దాని కాళులఁ బడితివా? నీబ్రదుకు మండిపోను. నీవు తండ్రి కర్మము మీఁద నక్కఱలేదు- తల్లి కుపచారముచేయ నక్కఱలేదు,

శ్రీరామచంద్రమూర్తిని స్మరింపనైన నక్కఱలేదు. అదిగో. అదిగో! ఆమహాతేజస్విని! ఆపతివ్రతాశిరోమణి! నోటిమాటకైన నెఱుఁగని పట్టిగోల! సంతతభగవచ్చింతాపరాయణమైన భక్తురాలు! ఆమెకాళ్లపైఁ బడి 'నేను ద్రోహిని, నన్నుఁ గటాక్షింపు' మని వేడ్వుము. నీసర్వపాపములు నశించును. మహాపతివ్రతాసేవకంటె, భగవత్సేవ యెక్కువది కాదు. నీవట్లు చేయవా? పో. నాకుఁ గొడుకు లేఁడు. నాకుఁ బుట్టిన దిదిగో! ఒక్కతయే కూఁతురు. ఇదియే నాబ్రదుకు పరిసమాప్తి నొందించును.

నారా—నీయిష్టము. నేను నీకు లేనప్పుడు నేనుఁ జేయఁదగిన దేమున్నది? చావఁదలఁచినవారి కెవ్వరుఁ జేయవలసినది యేమియు లేదు. నే నిక్కడ నుండను.

లక్ష్మి—నాథా! అమ్మగారియిష్టము ననుసరించి యిచ్చట నుండఁ గోరుచున్నాను.

నారా—ఉండవలయుననియే యున్నదనుకో—ఈమె కుట్టుమాటలు సహింపలేకుండ నున్నాను. నే నిచ్చట నెట్లుండఁగలను?

వెంక—నీబాగును గోరి—కొడుకవైన నీకుఁ జేతోడపై నాశిర ముండఁగా నేను బ్రాణము విడిచితినన్న మాటయైన నీకుఁ దక్కింపనెంచి నిన్ను నేను దిట్టినతిట్లు సహింపలేవా? వేశ్య కొట్టిన చీఁపురుదెబ్బలు— అదిగో— కుడిప్రక్కను— అవి సహింపఁగలవా? ఇంకను దానియొద్దకే పోవ నిశ్చయించుకొంటివా? చెప్పకంటెఁ జీపురే యధమమే. ఈసారి దేనితో దెబ్బలు తినుట కక్కడకు వెళ్లుచున్నావు?

నారా—ఈదెబ్బలు తిని నే నూరకుండలేను. నేను గొట్టకమానితి

ననుకొంటివేమి ? ఆతరువాత నింకజరుగవలసిన గ్రంథముకొ అకే యిప్పుడు పోయెద ననుచున్నాను. నన్నువ్వ రక్షపెట్టవలదు. నేను గాశికి పోవుదునా ? రామేశ్వరము పోవుదునా ?

వెంక—ఛీ! తుచ్ఛుఁడా ! నీబ్రదుకునకు కాశీరామేశ్వరములుగూడనా !

నారా—నే నిచ్చట నుండను. లక్ష్మి ! వింటివా. ఇంటిలో దాసియో మఱియొకతెయో యిక్కడ నుండును గావున రవంతతొందరగా నున్న దని తెలిసినప్పుడు నాకు దాసిచే వార్త పంపునెడలఁ బయిగెత్తుకొని వత్తును. చీటికిమాటికిఁ దొందరపడి, మీరు శ్రమపడి నన్ను శ్రమపెట్టవలదు. నిన్నరాత్రి నిద్రలేదు. దాని యింటితలుపు గట్టిగఁ గొట్టినయెడల నే నటనే పండుకొందును గావునఁ దలుపు తీయుదును. మఱేమియు భయము లేదు. అన్నియు బాగుగనే జరుగును అమ్మా ! నేను వెళ్ళుదునా ?

వెంక—నన్నడుగ నేల ?

నారా—తప్పనిసరిగఁ బోవలసివచ్చినది.

వెంక—నీతండ్రి పరమసాధువు. మహాపండితుఁడు. నేను బతివ్రతను. సన్నమంద్రైనను బరపురుషసందర్శన మెఱుఁగను. అట్లుకాక నేను వ్యభిచారిణినై యుండునెడల నీవు నీతండ్రికి పుట్టక మఱి యెవ్వరికో పుట్టితి వని నేను నిశ్చయించుకొనియుందును. ఇట్టి తండ్రికి, నిట్టితల్లికి నిట్టికొడుకవు పుట్టితివి. తల్లిదండ్రులకుఁ గొడుకులకు గుణములలో సంబంధ ముండక తీర దనుమాట తప్పు. మేము నిన్నుఁ బుట్టింపలేదు. నీప్రారబ్ధము ననుసరించి నీవు మా గర్భములఁ బడితివి. మాప్రారబ్ధమునను సరించి నిన్నుఁ

గంటిమి. ఇఁక నీకర్మము నీదే—నాకర్మము నాదే—నిన్ను నే నింకఁ జూడను—పో.

నారా—ఉన్నకొలఁది నొక్కటే వెఱ్ఱిధోరణి. (పోవును.)

లక్ష్మి—అచ్చీ—అచ్చీ—(అచ్చి ప్రవేశించును.)

లక్ష్మి—అచ్చీ! నీవిక్కడ నుండుము. ఈరాత్రి యిక్కడనే పండు కొను మని చెప్పితినిగాదా?

అచ్చి—అట్లె పండుకొందును. నా కేమియుఁ గష్టము లేదు. అమ్మా! బాబుగారు వెళ్ళినారా?

లక్ష్మి—(అప) వెళ్లినాడు. అచ్చీ! నీవు చచ్చిపోవువారియొద్దనుండి యెప్పుడైన జూచితివా?

అచ్చి—(అప) చూడ కేమమ్మా! నామగఁడు పోవుచుండగాఁ జూచితి నమ్మా!

లక్ష్మి—(అప) ఏమైనఁ గష్టపడినాఁడా?

అచ్చి—(అప) ఒడలుతెలియనికష్ట మమ్మా! బుసబుసలాడుచు శ్లేష్మము పొంగినది. కాళ్ళు చేతులు కొట్టుకొనినాఁడు—ఏమో కొంతసేపట్లు కొట్టుకొన్నతరువాతఁ జూడఁగ వట్టికొయ్య. ఈ ప్రాణాలను నమ్ముకొన్నంత పామరత్వము లేదమ్మా—

వెంక—లక్ష్మీ! వెళ్లినాఁడా!

లక్ష్మి—ఆ.

వెంక—తరువాతఁ గష్టమగును గావున నే నిప్పుడే క్రిందఁ బండుకొందును. చాపతెచ్చి పఱపుము.

లక్ష్మి—అత్తా! తప్పుకాదా.

వెంక—తప్పెంతమాత్రము లేదు. నాకు స్మృతి లేకుండునప్పుడు నీవు

నన్నిక్కడెవ్వరు క్రిందికి దింపలేరు. అప్పుడు నన్ను ముట్టుకొనఁదగదు. అందుచే నాచాప పఱపుము.

లక్ష్మి—అటులే (పఱచును.)

వెంక—వంటయింటిపంచపాళిమూరున దర్భలున్నవి. తీసికొనివచ్చి తలవైపునఁ బెట్టుము.

లక్ష్మి—(అట్లు చేయును.)

వెంక—అమ్మా! నాకు రవంత చేయూఁతనిచ్చినయెడల నేను గ్రిందఁ బండుకొందును.

లక్ష్మి—(అట్లు చేయును.)

వెంక—(నారాయణనారాయణ యని స్మరించుకొనుచుఁ బండుకొనును)—నాకు మైమఱపు హెచ్చగుచున్నట్లున్నది. ఆఁ. ఔను. నీవు కట్టుకొన్నది పట్టుబట్టయే కాదా?

లక్ష్మి—అవును.

వెంక—దేవతార్చనవేదికయొద్దకుఁ బోయి—గంగోదకమున్నది—అక్కడనే తులసీదళము లున్నవి తులసిని దొన్నెలో వేసి గంగోదక మందులోఁ గొంతపోసి—యిటకుఁ దీసికొని రా. ఇంతలోఁ దొందరలేదుసుమా! ఎఱుఁగనిదాన వని, నాకు స్మృతిలేనప్పుడు నీకుఁ జెప్పువా రుండరని యిట్లు చెప్పుచున్నాను.

లక్ష్మి—(పోయి గంగోదకాదులు తెచ్చును) అమ్మా! అన్నియు సిద్ధముగా నున్నవి.

వెంక—ఆలాగా—తల్లీ! సంతోషము. గడియ కొకటిరెండు పర్యాయములు తులసితీర్థము నానోటిలోఁ బోయుచుండుము, స్మృతియున్నంతవఱకు నేను నారాయణస్మరణము చేసికొందును

గాని యుడిపోయినపిమ్మట నీవు నాచెవిలో 'నారాయణా' యని స్మరించుచుండుము.

లక్ష్మి—అత్తా! అట్లే చేసెదను.

వెంక—తల్లీ! నాకొడుకు చేయవలసిన సమస్తోపచారములు నీవు చేయుచుంటివి! అంతముం దక్కఱకు వచ్చువాఁడే కొడుకు. నల్వురు కొడుకులున్న దశరథుఁ డగతికముగఁ జావలేదా? ఇఁక నాలెక్క యేమి? తల్లీ! నీ వున్నావు. అంతేచాలును. మనభారతదేశము కడుపుచల్లగఁ గన్నయుత్తమకాంతలలో నీ వొక్కతెవు. నీవు చేయుచున్న యీలోకోత్తరసేవకు నీపై దేవతలు పుష్పవృష్టి గురియింపవలసినది.

అచ్చి—అమ్మా! వైద్యుఁడుగారు వచ్చుచున్నారు.

(వైద్యుఁడు ప్రవేశించును.)

వెంక—అయ్యా! మీరు శ్రమపడి వచ్చినారు. చాల సంతసించితిని. మీ రింక నాకుఁ జేయు నుపకార మేదియు లేదు. నన్నుఁ బరీక్షింపనక్కఱలేదు. నేను మూటముల్లె కట్టుకొని యాత్రోన్ముఖురాలనై యున్నాను. నాకు గుండె లెగసి యెగసి పోవుచున్నవి. స్మృతితప్పుటకు సిద్ధముగా నున్నట్లున్నది.

వైద్యుఁడు—సరే. నేను బోవుదును. (పోఁబోవును.)

లక్ష్మి—(అప) నాయనా! ఈమెప్రాణము పోవుసమయము నాకెట్లు తెలియును?

వైద్య—(అప) అది యెవరు చెప్పఁగలరు?

లక్ష్మి—(అప) మీకుఁ దెలియకపోవునా? ఇదిగో- ఈచివ్వ మారంభించినపిమ్మట నింక కొంతసేపటికిఁ బ్రాణము పోవునని మీరు చెప్పలేరా?

వైద్యు—(అవ) గుండెలు తీవ్రముగాఁ గొట్టుకొనుచున్నవి. అది వొక్క వజబ్బు. అట్లు కొట్టుకొని, కొట్టుకొని యొక్కసారి యాఁగిపోవును. అప్పుడే విస్మృతి కొంత యారంభమైన ట్లున్నది. ఈవిస్మృతి దాదాపుగా రెండుగంట లుండును. అప్పు డామె నుదుటిపై యిందువగింజలవంటి చెమటబొట్లు నాలుగో యైదో కనఁబడును. అటుపై నొక్కగడియకంటెఁ దనువునిలువదని నిశ్చయించుకొనవలయును.

లక్ష్మి—చిత్తము. నాకు సెలవు.

(వైద్యుఁడు నిష్క్రమించును.)

అత్తా! అత్తా! పలుక కున్నది. విస్మృతి గలిగినది. ఇఁకను రెండుగంటలు వ్యవధియున్నదికదా! ఈలోపల నీమెయొద్దఁ గూరుచుండి నారాయణస్మరణ చేయుచుఁ దులసితీర్థము నోటఁ బోయుచుందును. (అట్లు చేయును.) (ఆమె చెవిలో) నారాయణా! నారాయణా! అచ్చీ! కుంకిపాట్లు పడుచున్నావు. రవంత సేపు నడుము వ్రాల్చుము.

అచ్చి—నిద్రలే దమ్మా!

లక్ష్మి—అచ్చీ! నే నొక్కపనిఁ జెప్పెదను; చేసెదవా?

అచ్చి—అమ్మా! ఇక్కడ నున్న దందుకొఱకే కాదా ?

లక్ష్మి—నీవు చంద్రరేఖయింటి కీరాత్రి వెళ్ళఁగలవా?

అచ్చి—వెళ్ళఁగలను.

లక్ష్మి—చూడు. నీవు వెళ్లుదువా నేను వెళ్లనాయని చూచుచున్నాను.

అచ్చి—మీ రెందులకు? నేను వెళ్లుదును.

లక్ష్మి—(తనలో) నే నీమె కెంతసేవఁజేసినను నామెకుఁగొంకుకుమీఁదనే దృష్టియుండక తప్పదు. కొడుకు నొడిలోఁ బండుకొని

ప్రాణము విడిచినఁగాని యీమె కుత్తరగతికిఁగూడ భంగము కల్గునేమో యని యనుకొనుచున్నాను. ఆవాంఛ తీరకపోవుటచేత దానికొఱకు మఱియొకజన్మ మెత్తవలసివచ్చునేమో? కొడు కూరనుండఁగా నేను సాహసించి నాతోడపైఁ బండఁబెట్టుకొనఁదగదు. అదిగాక యవసరమైనప్పుడు దాసిని బాపుమని యాయన చెప్పినారు. కాని దాసిని బాపునెడల నట్టైత్రొందర లే దని యెంచి యాయన రాకుండునేమో? అందుచేత నేనే పోవలయును. 'నీ వేల వచ్చితి' వని నన్నుఁ దిట్టునేమో? తిట్లకు సహించియైనఁ బోవలసినదే. కాని మానవలసినది కాదు. నేను వెళ్ళినను నాభర్త రాకుండునెడల నాలోప ముండదు. తరువాత భగవదిచ్ఛ యెట్లుండునో యట్లుజరుగఁగలదు. కాని యిట్టిసమయమున నత్తగారిని విడిచిపెట్టఁ దగదేమో? ఇంకను విస్మృతి రెండుగంటలదాఁక నుండునని వైద్యుఁడు చెప్పినాఁడు. ఈలోపలఁ దొందరయుండదు. కావునఁ బోవుదును. (పరిక్రా) అచ్చీ! నే నిప్పుడే మీబాబుగారినిఁ దీసికొని వత్తును. నీవు భద్రముగా నుండుము. ఇదిగో! ఈతలుపు వైచికొనుము.

(నిష్క్రమించును.)

ఇది తృతీయాంకము.

శ్రీరామా!

రాత్రిస్తంభము.

చతుర్థాంకము.

పరిదేశము—చంద్రరేఖగృహము.

ప్రవేశము—వేశ్యామాత, నారాయణరావు.

వేశ్య—చెడఁద్రాగి నన్నుఁ దన్ని, చంద్రి నష్టమైన తిట్లుదిట్టి దొడ్డి తలుపుతీసి పాఱిపోయితివా? నీకొఱకు వీథియంతయు నేను గుడ్డిదియు దీపాలతో వెదకితిమి. నీమీఁదఁ జంద్రి కెంతకోపముగా నైన నున్నది.

నారా—నీసేవచేసినయెడల నామెకోపము తీరిపోవునుగాదా! ఏది? నిన్నుఁ దన్నితినా? పాపము. ఎక్కడ?

వేశ్య—ఇదిగో- ఇక్కడ.

నారా—అయ్యో! అమృతాంజనము రాచి కాఁచెదను.

వేశ్య—కాఁపెందులకుఁగాని పైని మర్దనచేయుము.

నారా—(వేశ్యకాలిమీఁద రాయుచు) నాగమ్మా! చంద్రరేఖకుఁ గోపముపోవునట్లు చేయవలయునుజుమా!

వేశ్య—ఏదీ! ఏదైనఁ జేతిలో వైచి మాటలాడుము.

నారా—చుట్టలకట్టకం జేమియు లేదు.

వేశ్య—పెదవి ప్రక్క మండిపోను. అదే యిటు వాజవేయుము.

నారా—(ఇష్టుచు గట్టిగ మర్దనచేయును.)

వేశ్య—నీగొంతుకోయ. అంతగట్టిగ రుద్దెదవేమి? (తన్నును.)

నారా—(నులకమంచముమీఁద యాథాలాభముగఁ గూర్చుండఁబట్టి క్రిందఁ బడును.) దిక్కుమాలినముండ! తన్నెదవా! నీతల పగుల—

వేశ్య—నాకాళ్ళు పట్టినపంతువు. నిన్నుఁ దన్నినఁ దప్పేమి?

నారా—నీసిగఁదరగ! నీకాళ్లకు మందురాచితినిగాని నీకాళ్ళు పట్టితి నా? మాయమ్మ కాళ్లుచేతులు గిజగిజ కొట్టుకొనుచు దేవు లాడుచుండఁగా నట్టె యామెకాలిమీఁదఁ జేయివైవలేదు. ఈ మొసలి మొగపుముండకాళ్ళు పట్టితినఁట!

వేశ్య—అవి యేమో గొప్పతప్పులాగున ననుకొనుచున్నావా? నీవు నాకంటె గొప్పవాఁడ ననుకొనుచున్నావు కాఁబోలు. నీగొప్ప తనము ముండ! నీకేమున్నది? ఇల్లూడినదికదా! మాన్య మూడినదికదా! ఇంటిలో గుల్లలూడినదికదా! ఉంచుకొన్న సాని సాపాటున కేమైన నిచ్చినఁ గలదు లేకున్న లేదు. నీబ్ర దుకు నాబ్రదుకువంటిదే కాదా? ఆటకత్తెకు వయస్సెట్టిదో మగవానికి ధనమట్టిది. నీధనము దగ్ధపటమైనది. నావయస్సు వల్లకాఁడైనది. విత్తములేనివిటుఁడు మగవేశ్యామాత్ర యన్న మాట. అదిగాక— నాప్రాయపుదినములలో నే నీయాంధ్ర దేశమున కంతకుఁ గిరీటములేని చక్రవర్తినివలె నుంటిని. నాచిఱునవ్వుకొఱకు లక్షాధిపతులు కనుపెట్టుకొని యుండెడు వారు. కోటీశ్వరులను దన్నినయీకాలితో నిన్నుఁ దన్నఁగ నాకాలు చెడిపోయిన దని నే నేడ్చుచున్నాను. నీకు నాతాపు

తో స్వర్గము రాఁదగినది. ఇంకను గింజుకొనెద వెందులకు?

నారా—ఏమి పేలుచున్నావు? (తిరిగితన్నును.)

వేశ్య—ఓయమ్మో కడుపుగాల! నీపెండ్లాము త్రాడుతెగ! (ఏడ్చును.)

నారా—నీవు నన్నుఁ దన్నినప్పుడు నే నూరకుందు ననుకొంటివా?

చంద్ర—(ప్రవేశించి) దిక్కుమాలినకొంప ఒక్కటేగోల! రవంత సేపు నడుము వాల్చుట కవకాశము లేదుకదా! ఏమి నారాయణా! ఎందులకు మాయమ్మతోఁ బోట్లాడుచుంటివి? అది తన్నిన దని దానిపై నేరమా? పెద్దది—అందులో నత్తగారు—తన్నఁ గూడదా? నీకు బుద్ధివచ్చుటకే తన్నినదా—నీపైఁ బగచేతఁ దన్నినదా? నిన్నఁ జెడఁదాఁగి, దానినిఁ గొట్టి, తలుపుతీసి పాఱిపోయితివే—అదృష్టవశమున దొంగలు పడలేదు కాని, మాచేతికి ముష్టిచిప్ప రాఁదగినటుల చేసితివి గాదా! ఇట్టినిన్నుఁ దన్నినఁ దప్పు లేదులే—అదిగాక, పరిహాసమునఁ దన్నినను దన్నవచ్చును. నీవు నిన్న రాత్రి చేసిన పనికి నీమొగ మింకఁ జూడఁగూడదని నిశ్చయపఱచుకొంటిని. రాత్రి నీకొఱ కెంతబాధపడితినో నీవెఱుఁగుదువా? నీపై మమకారము నన్నన్నివిధములఁ గటకటలాడించుచున్నది.

నారా—నీ విట్లుపేక్షించినయెడల నది నన్ను మఱింతతన్నునే?

వేశ్య—నాకాలినొప్పి నేను జూచుకొనననుకొన్నావు కాఁబోలు?

చంద్ర—మాటమీఁద మాట—నారాయణా! నీ విటురా—చీట్ల పేక యాడుకొందము. (లోనికి నిష్క్రమింతురు.)

వేశ్య—మొండిముండకొడుకు ఎంతతన్నుఁ దన్నినాఁడో—రవంత సేపు నడుము వాల్చినఁగాని బాధతీఱదు.

(మంచముపైఁ బండుకొనును.)

(నేపథ్యమున తలుపుగుద్దులు వినఁబడును.) ఎవరులోపల-తలుపు-తలుపు.

వేశ్య—(లేచి) ఒక్కటే గోల—ఎవరక్కడ? గొంతుఁ జింపుకొని చచ్చినసరే—నేను లేవను.

(ఆసందడి విని చంద్రరేఖ, నారాయణరావు రంగమునకు వత్తురు.)

నారా—నా కొఱకెవ్వరైన వచ్చినా రేమో చూతును.

(తలుపు తీయును.) (లక్ష్మి ప్రవేశించును.)

నారా—ఆ! నీవా? అంత కేకలువేసితి వెందులకు? మాయమ్మ యెట్లున్నది?

లక్ష్మి—క్షమింపుఁడు-వినఁబడ లేదుకదా యని వేయవలసివచ్చినది. మాయమ్మ నేను వచ్చునసరికి బ్రదుకియున్నది.

చంద్ర—నాకొంప యల్లరిచిల్లరకొంప యనుకొంటివా? ధర్మసత్రమనుకొంటివా? నేను గడనెక్కి యాడు దొమ్మరిసాని ననుకొంటివా? వేళపాళ లేకుండ నాతలుపు గొట్టెదవా? తలుపుతీసి ని కాతిథ్యమిచ్చుటకు నీవు పోషించుచున్న బానిసలిక్కడ నెవ్వరైన నున్నా రనుకొంటివా? నీకు నాపై నంత స్వాతంత్ర్య మెవఁడిచ్చినాఁడు? నాకింతరాత్రివేళ నిద్రాభంగమును గలుగఁజేయుటకు నీ వెందులకు సాహసించితివి?

లక్ష్మి—అమ్మా! క్షమింపుము. నేను మహాపదలో నుండుటచే నిన్ని యోజింపలేకపోయితిని.

చంద్ర—నీవు మహాపదలో నుండు నెడల నీపాటు లేహో నీవు చూచుకొనవలసినది. నీయేడ్పు లేహో నీ వేడువవలసినది. కాని నీ మూలమున నాకు బాధ యెందులకు?

లక్ష్మి—నాధర్మ యిటనుండుటచేత రావలసివచ్చినది.

నారా—నిన్ను నేరమ్మంటినా ? దాసిని బంపుమని చెప్పితినిగాదా?

లక్ష్మి—దాసిని బంపునెడల మీరు రారేమో యని వచ్చితిని.

చంద్ర—నీవు వచ్చినంతమాత్రమున నీతఁడు నీవెంట వచ్చునని యనుకొంటివికాఁబోలు—ఏది? అతఁడేమాత్రము వచ్చునో నీ వేమాత్రము తీసికొనిపోవుదువో చూతము. నాయింటిలోనున్నవానిపై నా కామాత్రము స్వాతంత్ర్యము లేదనుకొంటివా?

నారా—వచ్చుటమాటయో రాకపోవుటమాటయో చూచుకొనవచ్చును గాని, యాఁడుదానవు, సంసారిణివి; అర్ధరాత్రమున నొక్కతెవు రావచ్చునా ?

చంద్ర—సంసారిణికాదా ? మహాపతివ్రతకాదా ? అందుచేత నర్ధరాత్రమునఁ విలాసార్థముగఁ దిరువీథులు వేంచేసినది. పడుచుకొనుటయే వృత్తిగాఁగల మేముసైతము నింతసాహసించి, యింతతెగించి, యింతపురుషలక్ష్యము లేకుండ, నింతమొండితనముతో, నింతరాత్రి వీధిగుమ్మము దాఁటుదుమా ? మమ్ము మించిపోయితివా మాతల్లీ! అట్టినీవు నీమగని కరుంధతివి. ఏమి చెప్పను. ప్రపంచధోరణి యీలాగుననున్నది.

లక్ష్మి—రామరామా రామరామా (చెవులుమూసికొనును.)

నారా—ఓసినిర్భాగ్యురాలా ! వింటివా చెప్పుదీసికొని నిన్ను నన్ను నామె యెట్లు కొట్టుచున్నదో ? నీవు నాగౌరవమున కెంతభంగము కలుగఁజేసితివి ! నల్వురిలోఁ దలయెత్తి తిరుగుచున్న నా కింత తలవంపులు తెచ్చితివి. ఆఁడుదాని కింతస్వాతంత్ర్యమా ? ఇంత స్వేచ్ఛావిహారణమా ?

లక్ష్మి—నాథా ! ఇట్లు వచ్చుట యందింత తప్పున్నదని [illegible] యక వచ్చితిని. క్షమింపుము.

నారా—సరే, మాయమ్మ దేహస్థితి యెట్లున్నదో స్పష్టముగాఁ జెప్పు.

లక్ష్మి—మీరు లోపలికి వచ్చునెడలఁ జెప్పెదను.

నారా—(చంద్రరేఖ వంకఁ జూచుచున్నాఁడు.)

చంద్రి—నీవు నావంకఁ జూచు టెందులకు ? నిన్నుఁ బొమ్మని నే నందునా—పోవల దందునా ? నీయిష్టమువచ్చినట్లు చేసికోవచ్చును. వీధిగుమ్మము దాఁటి నాలుగడుగు లావలఁ బెట్టినెడల నీకే తెలియును. క్రొత్తగవచ్చిన యేమిండగానిచేతనో నీతలపగులఁ గొట్టించును. నీశరీరమును మాయింటఁ బడవేయించును. నేను నిన్నుఁ జంపినా నని లోకమున వెల్లడిచేయును. నన్నురితీయించును. తాను పైయూర ధర్మసత్రము వేసి లోకోపకార మొనర్చును.

లక్ష్మి—రామరామా—రామరామా—రామరామా (చెవులుమూసి కొనును.)

చంద్రి—అబ్బ ! అబ్బ ! రామభక్తురాలు—సర్వసంగపరిత్యాగిని యైన యోగిని.

నారా—నీవు యోగ్యురాలవే యనుకో. నిన్నుఁ గూర్చి జనులు పలు విధముల శంకింపవలసిన దురవస్థలోఁ జిక్కుకొంటివేల ? నేను వెలుపలికి రాను. చెప్పవలసిన దేదో యిక్కడనే చెప్పుము.

చంద్ర—" యోగ్యురాలవే యనుకో" యని యీసన్నాయినొక్కు లెందులకు? యోగ్యురా లని నాకు విశ్వాసము లే దని నీవు చెప్పుటకా? యోగ్యతయఁట. ఏమి యాయోగ్యత! ఎక్కడ నున్న దాయోగ్యత! సంసారములో నున్న దెంత పిత్తశరీణి యయ్యును యోగ్యురాలు. సాని దెంత కట్టుదిట్టమైన దైనసరే యయోగ్యురాలు. ఇంతే ప్రజలయూహాను. సంసారిశబ్దము

లో యోగ్యతయున్నది. సానిజన్మములో నయోగ్యతయున్నది. అంతేకాని మనుష్యులలో లేదు. సంసారిణులు, సానులు తల్లి కడుపున నొక్కలాగే పుట్టుదురు. వారికిఁ దత్వ్వములలో భేద మెంతమాత్రము లేదు. సానిదానిని దుచ్ఛారిత్రాలంపటురాలి గను, సంసారిణిని వైరాగ్యసంపన్నగను భగవంతుఁడు పుట్టుక తోనే చేసియుండలేదు. మాకంటె మిఁకిలిమాటీనవారు సంసారి ణులలో నెందఱో యున్నారు. సంసారిణులకంటెఁ బతివ్రత లైనవారు మాలో నెందఱో యున్నారు. సంసారిణి మైనమె డల నాహాహా! యని చేతులుజోడించుకొని దూరముగఁ బో వుదురు, సానిమైనమెడల హెహెహె తుచ్ఛురాలని కనుఁ గీఁటి, మీఁదికి రాఁబోవుదురు ప్రతిజనునికిఁ బెద్దపోఁగాల మై యున్నది. ఇట్టివారిని బారగజ్జెలకుఁ గట్టి యుత్తరదక్షిణా లక్రింద మోఁదవలసియున్నది.

నారా—చంద్రశేఖా! నన్ను క్షమింపుము. నిన్ను నేనేమియు ననలేదు.

చంద్ర—నన్నన్నవారిని జోడుతీసికొని తన్నెదను.

నారా—(అప) ప్రాణప్రియా! నాభార్యయెదుటమాత్రము నన్నుఁ దిట్టకుము. నీచేతఁ దిట్లుతిట్టించుకొనుట నాకు గౌరవలోప మని కాదుసుమా! అట్లుమాత్రి మనుకొనకుము. మనకు మనకు నత్యంతమైన మమకారము కావున మన కట్టిభేదము లేదు కాని యిట్టిప్రేమతత్త్వప్రాబల్యము నాభార్య యెఱుఁ గని దగుటచేత నీతిట్లేమో దానికి విపరీతములుగాఁ గనఁబ డును. పైకిఁ జెట్లెంతపోయినదో, లోపల వేరంతలోఁతునకుఁ బోయినట్లు, నీతిట్లెంతవిశేషముగ విజృంభించునో మన కన్యో న్యప్రేమ మంత యగాధమని నాభార్యకుఁ దెలియదు. పాప

రత్వము చేతను దెలియకపోవచ్చును, పణ్యవీథిపరిపాటి కలవాటు పడివది కాకపోవుటచేతఁ దెలియకపోవచ్చును.

చంద్రి—మా న్యాయమైనచర్యయే ప్రపంచమున కన్యాయముగాఁ గన్పట్టుచున్నది. భార్య లవిటిచేతిసొట్టకాలియుడుసుకంటిదయ్యావుమొగపుముండ లగుటచేతనో, పైవెలుపలిథాటిగలవా రగుటచేతనో, దీర్ఘరోగభూయిష్ఠ లగుటచేతనో, వీథినిఁ బడవలసి వచ్చిన నిర్భాగ్యులగు పురుషుల నాదరించి, యక్కఱదీర్చినందులకు మా కీపురుషుల తల్లిదండ్రులచేఁ దిట్లు, సోదరులచేఁ దిట్లు, భార్యలచేఁ దిట్లు- అంతటితోనైనదా? ప్రజలందఱిచేతఁ దిట్లు- వారిసంసారముల పైచికొంటిమనియు, వారియిల్లు గూల్చితి మనియు, వారిమర్యాదలు మంటఁ గలిపితి మనియు, వారికొంప దోఁచుకొంటి మనియు, వారియున్నతికి భంగముకావించితిమనియు మమ్ము మోసకత్తెలుగ, నసత్యవాదినులుగ, బందిపోటుదొంగలుగ, రాక్షసులుగ, ప్రాణాపహారిణులుగఁ బరిగణించుచున్నారు. మేము ధనము పుచ్చుకొందుమఁట- చేసిన సేవకు ధనము పుచ్చుకొనని వారు లోకమున నున్నారా? ఈధనము కొఱకే కాదా ప్రజల కన్యోన్యసంబంధములు. తండ్రికిఁగొడునకు సంబంధము—అన్నకుఁ దమ్మునికి సంబంధము—ఆలికి మగనికి సంబంధము—గురునికి శిష్యునకు సంబంధము—రాజునకుఁ బ్రజకు సంబంధము— ఇట్టికోమటిసంబంధములకు ధనమే మూలముకాదా? అన్నిసంబంధములు ధనసంబంధములే యైనను, నొక్కవిటవేశ్యాసంబంధముమాత్రమే ధనసంబంధమఁట! మాకు వెలవెలఁదులని, ధనకాంత లని పేళ్లుకాదా? వంటపూటింటిదానికి ధనకాంత యనుపే రున్నదా? లేదు.

మరుగుదొడ్లు శుద్ధిచేయుదానికి వెలవెలఁది యని వేసన్నదా? వీరికంటె మే మధమల మనియే కాదా ప్రజలయభిప్రాయము. మాకొక్కధనమే ప్రధాన మనియు, దయాదాక్షిణ్యములు, మనుష్యత్వముకూడ మాకు లేవనియుఁ బ్రజలయభిప్రాయము. ఇంతబుద్ధి లేనిప్రజ లుండుటకంటె భస్మమగుట మంచిది.

నారా—చంద్రరేఖా! ఈరాత్రి ప్రపంచవైఖరినిగూర్చి శారదాదేవి వలె నుపన్యాస మారంభించితివే! మహాత్మురాలవు! ఏధోరణిలోఁ బడినపు డాధోరణిలోనే మెఱుఁగుతేఁగల బుద్ధిమంతురాలవు.

చంద్ర—ఇదిగో— ఈమహాపతివ్రత, నాపుణ్యమున, నాయిల్లు పవిత్ర మొనర్చుటకు వచ్చినది కావున నింతదూరము చెప్పవలసివచ్చినది. ఓసాధ్వీతిలకమా! నీకాఁడుతనము లేకపోవుటచేతనో, మగతన ముండుటచేతనో, నీభర్త మాయిల్లుపట్టినాఁడు. నేను నాల్గుమాసములవఱకుఁ గుక్కను గొట్టినట్లు కొట్టివైచితినో లేదో— యర్థములేని చూపుతో నున్న నీమగనినే యడుగుము. నాప్రమాణముగా నే నతని నాకర్షింపలేదు. ఈతని వలన నే నేమియు బాగుపడలేదు. అనేకవిధములఁ జెడిపోయితిని. నేను బరమపాపాత్మురాల నని, కిరాతురాల నని, నన్ను నీ వేమో తిట్టుచున్నావఁట. నాయథార్థతత్త్వ మేదో నీకుఁ జెప్పుచున్నాను. నాయోగ్యతముందు నీదొకయోగ్యత కాదు. ఇంతటినుండియైన నొడలు తెలిసికొని మాటలాడుట మంచిదని బుద్ధిచెప్పుచున్నాను.

లక్ష్మి—నిన్ను నే నెప్పుడేమియు ననలేదు.

చంద్ర—నీవో నీయత్తయో—ఎవ తెయైన నేమి?

నారా—చంద్రరేఖా! దయ యుంపుము. ఈమెవచ్చినసంగతి యేదో కనుఁగొందము.

చంద్రి—కానీ—నేను వలదంటినా? పేకయాట యంతయుఁ జెడిపోయినది.

నారా—లక్ష్మి! నీవు వచ్చినపని యేదియో త్వరగఁ జెప్పు.

లక్ష్మి—మాయత్తకు గుండె తెక్కువగాఁ గొట్టుకొనుచున్నదఁట-గుండె యాగిపోవు నని వైద్యుఁడు చెప్పినాఁడు—నేను వచ్చుసరి కామెకు స్మృతి లేదు. నేలపైఁ బండుకొనియున్నది.

నారా—అంతవఱకు వచ్చినదా?

లక్ష్మి—ఆఁ.

నారా—ఇట్టిస్థితిలో నేను వచ్చి చేయవలసిన దేమున్నది? మాటయా—చూపా యే మున్నది? నాడి పట్టి బేలగుండె. అందులోఁ దల్లి గాని మఱియొకరు మఱియొకరా? నేను రాలేను. మాయమ్మ కిక్కడనుండియే నమస్కార మర్పించుచున్నాను. తూర్పు తెల్లవాఱుటతోడనే వచ్చెదను.

చంద్రి—ఉదయమున నౌషధమునకుఁ బోయి మాయమ్మకాలినొప్పికి మందుదెచ్చెద నంటివి కాదా? తెల్లవాఱుజామున నింటికిఁబోవుట కవకాశ మెట్లున్నది? నీవు మందు తేకున్నయెడల నెవ్వరు తెత్తురు? నీవు జీతమిచ్చి పోషించుచున్న భృత్యు లెవ్వరైన నిచ్చట నున్నారా?

నారా—ఇంటికిఁ బోయి చూచినతరువాత నైనఁ దెచ్చిపెట్టఁగలను. అది యెంతపని?

లక్ష్మి—నాథా! మీరు రా ననుచున్నారా?

నా—ఉపయోగములేనప్పు డేల శ్రమపడవలెను? నిన్నరాత్రి నిద్రి

లేదు. ఈరాత్రి నీమూలమున నిద్రలేదుకదా! నాశరీరము మంచిదికాదని యెఱుఁగనే యెఱుఁగుదువు. నేను మంచమునఁ బడినయెడల నీగతి యేమి?

చంద్రి—'నీగతియే మని' భార్య నంటివికాని యామాత్రముమాట నన్నుఁగూడ ననుటకు నీకు నోరు రాకపోయెనా? తొత్తునై నీ కెంతకాల మూడిగముఁ జేసినను నీ కభిమానము లేకపోయినదే! మూఁడేండ్లనుండి నీకు భార్యనై సమస్తవిధముల నిన్నుఁ గొల్చుచుంటినే-నే నామాత్రపుమాట నోఁచుకొనుటకుఁ దగనా? చేతియీవి లేకపోయినను నోటిమాట కేమి? ఏదైన వ్యత్యాసము కల్గునెడల నీభార్యవలెఁ దలఁదీయించుకొని, ముసుఁగువైచికొనను గాని బ్రహ్మచర్యదీక్ష నవలంబింపనా! ఆ! నారాయణార్పితమగు నాశరీరము వైశ్వానరార్పణము కావలసినదే కాని—

నారా—నీ వెంతయోగ్యురాలవో నే నెఱుఁగుదును; కాని నాభార్య యెఱుఁగదు కాదా?

లక్ష్మి—నాథా! తల్లిగారిని మీ రీసమయమున వదలి యుండఁగూడదు. అది యిక్కడకుఁ దగదు. అక్కడకుఁ దగదు.

నారా—లక్ష్మి! ఏది తగునో యేది తగదో నాకుఁ దెలియ దనుకొంటివా? ఇందునుగూర్చి నీవు నాకు వేరే చెప్పనక్కఱ లేదు. నీవు త్వరగాఁ బోవుట మంచిదికాదా మఱి?

లక్ష్మి—మీతోడపైఁ దనశిర ముంచి ప్రాణము విడచినఁగాని యామె యాత్మకు శాంతి కలుగదు. దయయుంచి రమ్ము.

నారా—ఇది యొకవెఱ్ఱి యూహము. ఆమె యుత్తమురాలు. ఆమె యుత్తమత్వమువలని సుగతి యామెకు లభించును. నే నిక్కడ

నుంటిని గాన నీ వట్లు కోరితివి. నేను మఱెక్కడ నైన నుండు నెడల నామె కుత్తరగతు లూడిపోవలసినదేనా ? ప్రపంచధర్మమునుబట్టి చూచినను బరమార్థమునుంబట్టి చూచిననుం నే నామెయొద్ద నుండుట యనావశ్యకముగాఁ గనఁబడుచున్నది. అనవసరములైన కార్యములందుఁ బ్రవేశించుట బుద్ధిమంతులకుఁ దగదు.

లక్ష్మి—ఇంతకంటె నవసరము మఱెప్పుడు కలుగును ? ఆమె తిరుగ మీకంటఁ బడునా ? ఆమెను గడపటిసారి చూచుటకైన రండు.

నారా—ఉదయములోపల నేతొందరయు నుండదు. తొందరకలుగునని యే యనుకో. తెల్లవాఱినపిమ్మట రానా చూడనా ? తరువాతికృత్యము లన్నియు జరిగింపనా ? లక్ష్మీ ! నీ విట్లనవసరముగ నెప్పుడు ప్రత్యుత్తరములు చెప్పినదానవు కావుగదు. ఇంటికిఁ ద్వరగ నడు.

లక్ష్మి—నాకు బహుమనస్తాపముగా నున్నది. ఆమె నింతదిక్కుమాలినదానింగాఁ జేయుట ధర్మము కాదు. ప్రజలు నిందింతురు. భగవంతుఁడు శిక్షించును.

నారా—ఛీ ! ఛీ ! తలకుఁ దగని ప్రలాపములా ? నోరుమూసికొని పొమ్ము.

చంద్ర—సాధ్వీమణి కాదా ? మగనిలక్ష్య ముండునా ? ఇంత పెంకిపట్టు గలదాని, నింత మొండిదానిని, మగని నెదిరించి ఝూంకరించిన యింతలజ్జాశూన్యురాలినిఁ జంద్రమతీదేవి, సీతాదేవి యంటివే ! నీవు నా మెడలోఁ దాళిగట్టితివా? నాతో సప్తపాదములు త్రొక్కితివా?అగ్నిసన్నిధినిమనముప్రమాణములొనర్చుకొంటిమా? అట్టి నేను, నీమాటకెన్నడైన జవదాఁటితినా? నీవన్నది యాజ్ఞ

యని శిరమున ధరించితినే. నీవు పెట్టినది భిక్ష మని చేయి చాఁచితినే-నే నిక్కడనుంటిని-మాయమ్మ యానులకకుక్కపైఁ గూలఁబడి యీచిత్రమును జూచుచు ముక్కుపై వ్రేలువైచి కొని తెల్లఁబోయి కూరుచుండినది_గాడిదెయంత మగఁడవు నీ వెదురుగ నుండి 'పో పో' యని యెంగ్రడపెట్టుచుంటివి_ నలుసంత టొంకిన దేమో చూడు-తెప్పవాల్చిన దేమో చూడు-ఆఁడుది యనఁగా నిది, ఇట్టివారే దండుదండు నంత సంతుష్టిపఱుపఁగల నెఱజాణలు.

లక్ష్మి—రామరామరామా—రామరామరామా.

(చెవులు మూసికొనును.)

చంద్రి—ఇందులో నిది యొక్కవిశేషము! దూకినగోడలు దూకుచునే యుండవలయును-చేసిన రామస్మరణలు చేయుచునే యుండవలయును—కోసినగొంతులు కోయుచునే యుండవలయును చేసినరామస్మరణలు చేయుచునేయుండవలయును. మనుజులలో నిది యొక్క సంకరజాతి. దొంగ కాఁడు భర్తుఁడు కాఁడు. అదియు నిదియుఁ గూడిన కంచరగాడిదెజాతి.

నా—తుచ్ఛురాలా! ఇంకను బోవేమి? ఇంకను బోవేమి?

(చేయియెత్తి మీఁదికిఁ బోవును.)

చంద్ర—ఓరి నపుంసకుఁడా! క్రియలేని పలుగుమాట లేల? పంచపాళిలో మాయమ్మ కఱ్ఱతెచ్చి పొడువక కోఁతిలాగున నెగురులాడెదవేల?

వే—ఇదిగో. నాయొద్దనే యున్నది. తీసికొనుము.

లక్ష్మి—(పోఁబోవును.)

నారా—(కఱ్ఱ తెచ్చి లక్ష్మమ్మ ప్రక్కటెముకలలోఁ బొడుచును.) పోవా! నీముండమోయాయ! పోవా!

లక్ష్మ—రామ రామా. (క్రిందఁ బడిపోవును.)

నా—(తెల్లఁబోయి చూచును.)

చంద్రి—ఆమాత్రపుఁ బోటునకేఁ గ్రిందపడినవా రెవ్వరు నుండరు. ఈమె తాఁగివచ్చుటచేత నిట్లు తూలిపోయినది.

లక్ష్మ—(లేచి) రామరామ్మరామా (పోవుచు) నాథా! నమస్కారము. (పోవును.)

చంద్రి—పనికిమాలిన గొడవతోఁ గాలము వృథయైనది. నారాయణా! పేకయాడుకొందము రా!

నా—ఇప్పు డేమియు వలదు.

చంద్ర—భార్యను గొట్టినందుల కేడ్చుచున్నావా?

నా—నాకుఁ దలనొచ్చుచున్నది. పండుకొందును.

చంద్ర—సరే—నీ కర్మము. (నిష్క్రమించును.)

నా—వెళ్ళుచున్నప్పుడు నాకు నమస్కరించుచు నాపై నొక్కచూపు చూచినది. అట్టిచూపుమాత్రము నే నెక్కడను జూడలేదు. అది యేమో వింతగా నున్నది. ఆచూపుతో నామనస్సు చేయిపెట్టి కలిపిన ట్లయినది. ఆచూపులో దైన్య మున్నది—ధైర్యమున్నది. దయ యున్నది—రవంత కాఠిన్య మున్నది. అన్నిటిని మించిన దేదో యలౌకిక తేజ మున్నది. నా కిప్పుడే పోవలయు నని యున్నది కాని యీముండ పోనీయదు. తెల్లవాఱుచుండగఁ బోవుదును. (నిష్క్రమించును.)

ఇది చతుర్థాంకము.

శ్రీరామా!

రాతిస్తంభము.

పంచమాంకము.

పరిదేశము—నారాయణరావుగృహము;

ప్రవేశము—లక్ష్మి, నారాయణరావు.

నారా—దుర్మార్గుఁడనై కిరాతుఁడనై నిన్నుఁ గత్తితోఁ బ్రక్కటెముకలలోఁ బొడిచినప్పుడు నీవు నావంకఁ జూచిన చూపున్నదే! అది నామనస్సులో నేదియో మార్పుఁ గలుగఁజేసినది. మనస్సునకుఁ బుట్టిన వెఱ్ఱివెఱ్ఱితలల నన్నై ఛేదించిన ట్లయినది. హృదయములోనున్న మాలిన్యమునకు నిప్పంటించిన ట్లయినది. ఎఱ్ఱిమట్టితో నున్న నీటికుండలోఁ జిల్లగింజ వైచి చేతితో నీరు గిరగిర త్రిప్పిన ట్లయినది. ఎఱ్ఱఁగఁ గ్రాఁగినలోహము మూసలోనున్నప్పుడు కమసాలిగొట్టముతో నుఫ్ఫాని లోనున్న కశ్మలత్వ మెగురఁగొట్టిన ట్లయినది. నాయనుభవ మనేకవిధములుగా నున్నది. ఆచూపు నాచిత్తమును గట్టిగ నూఁచి దులిపినట్లొకప్పు డుండెను. రెండు చేతులనడుమఁ బెట్టి గట్టిగ నలిపి రసముపిండిన ట్లొకప్పు డుండెను. మనస్సులోనుండి యేదో యావలికిఁ గొంతపోయిన ట్లున్నను మనస్సు నీరసముగా లేక బలముగా నున్న

ట్లున్నది. ఇదేమో నాకు వింతగా నున్నది.

లక్ష్మి—నాథా! నే నొక్కముఖ్యమైనమాట చెప్పుట మఱచినాను.

నార—నీమాటకంటె నేను జెప్పఁబోవుమాట ముఖ్యము కావున నది వినుము. నాకుఁ బిశాచావేశ మగుటచేత నిన్నుఁ బొడిచితినో నా కున్మాదావస్థ సిద్ధించుటచేఁ బొడిచితినో నాకుఁ దెలియదు. ఎట్లైననేమి పొడిచితిని. యమధర్మరాజు నాచేతుల నటుతరువాత ఖండించుఁగాక! రోటిలోఁ బెట్టి దంపించుఁగాక! ఇనుపగానుగలోఁ బెట్టి యాడించుఁగాక! ఆతనిశిక్ష యేదియైన సరియే నేను బరిగణింపను గాని నీవు న న్నుపేక్షించితివి! ఇదిగో నిన్నుఁ బొడిచినకత్తి- దీనిని జాగ్రత్తపెట్టి యుంచితిని. ఎందులకో తెలిసినదా? నేను జచ్చిన పిమ్మట దీనిని నాచితిపైఁ బెట్టి కాల్పింపవలయును. దీనితో నీవు నాతలఁ బగులఁగొట్టుము. అంతవఱకుఁ జేయలేవా; నాడొక్కలోఁ బొడువుము. నీవు నన్నుఁ గొట్టినఁగాని నామనస్సు శాంతిపడదు. నీ వుపేక్షించినకొలఁది, నీవు నన్నుఁ గొట్టకూరకుండినకొలఁది, నిన్నుఁ గొట్టితి నన్నబాధ నాకు క్షణక్షణము వృద్ధి యగుచున్నది. కొట్టవా! కొట్టవా! పోనీ—గట్టిగనైనఁ దిట్టుము. అదియైనఁ జేయవా? నీవు శాంతించినకొలఁది నాహృదయతాప మెక్కువగుచున్నది. శిక్షకు శిక్ష భగవంతుఁ డేర్పఱచినాఁడు. నిన్ను నేను గొట్టినప్పుడు నీవు ‘‘నాథా! నమస్కారమ’’ని యనుట చేత నాగుండెలలో నిప్పు పుట్టినది. నీవట్లనక ఛీ యని గట్టిగా ననినఁగాని, థూ యని నిరసించి నామొగముపై నుమిసినఁగాని నే నింత ప్రాణబాధ పడియుండను. కావున నాకు శిక్షచేసి రక్షింపుము.

లక్ష్మి—నాథా! తొందరపాటు శాంతివలనఁగాని నశింపదు. శిక్ష కొపథము బహుమానము కాని శిక్ష కాదు. నీవు నన్నుఁ గొట్టినప్పుడు నిన్ను నేను దిట్టినయెడల నీమనస్సు మంచిమార్గములోనికి రాదు. "నే నిచ్చినదెబ్బకుఁ బ్రతిక్రియ జరుగుటచేత నిఁక నాఋణము తీఱిపోయినది కదా!" యని నీవు స్వతంత్రింతువు. నిరంకుశముగ నుందువు. ఇంకొకసారి కోపమున నీవు నన్నుఁ గొట్టుటకుఁ బ్రయత్నింతువు. మఱింతగట్టిగఁ గొట్టిన యెడల మఱినాల్గుతిట్లు నావలన నీకుఁ గలుగును. కాని యంతకంటె మఱేమియుఁ బ్రమాదము లేదని నీవు ధైర్యముతో నుందువు. నీశిక్షను నేను బ్రతిక్రియ చేయక యుండు నెడల నీవు నన్నుఁ గొట్టుట యెన్నఁడు తలపెట్టింపవు. వెనుకఁగొట్టినదెబ్బయే ప్రతిక్రియారాహిత్యముచేత నిన్ను బాధించుచుండ నీవు నన్నెన్నఁడు బాధింపవు. ఇది నీమాటకు నామాటకుఁ జెప్పిన మాట కాదు. లోకవ్యవహారధోరణి యిట్లున్న దని చెప్పుచున్నాను. అపకారమునకుఁ బ్రత్యపకారశూన్యతయే పునరపకారవాంఛను దొలఁగించుచుండ నపకారమున కుపకారమే చేసినయెడల నిఁకఁ జెప్పవలసిన దేమున్నది? ఈమాటలకేమి? నేను జెప్పఁబోవుమాట వినుము. మీయమ్మగారు పదినిముసములక్రిందఁ బరమపదింతు రనఁగా నామెకు స్మృతి వచ్చినది.

నారా—మాయమ్మగారి యవసానదురవస్థను నాకు జ్ఞప్తిచేయకుము. నేను వినను. నామనస్సునుండి యది తుడిచిపెట్టకతప్పదు. ఆమెమరణకాలమహాదురవస్థను మఱచిపోవుటకు నేనేమి చేయఁగలను? మెదడులో జ్ఞప్తిస్థలమైన నరములకూడికను దీసికేయఁగల వైద్యుఁ డెవఁడు? అది యెట్లు సాధ్యమో నీకుఁ

తెలియునా? నల్లమందు మ్రింగనా? నల్లయుమ్మెత్తగింజలసారము త్రాగుదునా? స్మృతిపోవు వనాంతరము నీవేదైన నెఱుంగుదునా? ఆవున కాముదపాకువలెఁ, గాకికి గ్రిచ్చపప్పువలె, నాకు విస్మృతిఁ గలిగించు నౌషధిని జెప్పువారిపాదములకు సాష్టాంగ మొనర్తును.

లక్ష్మి—నాథా! ఉన్నప్పుడు తల్లిగారిమాట మఱచిపోయి యామె లేనప్పుడుకూడ నామెమాట మఱచిపోవునప్పుడు తల్లి ఋణము తీరునెట్లు? ఆమె ననుదినము స్మరింపుము. ఆమెకు మనస్సులో నమస్కరించుకొనుచుండుము. అంతకంటె నీ వామెకుఁ జేయఁదగిన దేమున్నది? దొడ్డిలోఁ బెద్దనుబ్బరోటిక్రింద నెనిమిదివందలరూపాయలమూట యున్నది. దానిని దీసికొను మని చెప్పినది. ఆసొమ్ము నీది కావున నీవే తీసికొనుము. రామా రామా! తిరిగి డొక్కలోఁ బోటారంభమైనది. ఈసారి మఱింత గట్టిగా వచ్చినది.

నాథా—ఇదివఱకు పోటని చెప్పలేదే?

లక్ష్మి—తెరతెరలుగా రాత్రినుండి వచ్చుచునే యున్నది. సహింపఁ గలిగినంతవఱకు మీతోఁ జెప్పలేదు. రామరామరామా రామా!

(గిజగిజ కొట్టుకొనును.)

నాథా—అయ్యయ్యో! కాచనా? వైద్యునిఁ దీసికొనివత్తునా? అచ్చీ! నీవిటురా—నిప్పుచేసి నీవు కాచుచుండుము నేను బోయి వైద్యునిఁ దెత్తును.

లక్ష్మి—తొందరపడవలదు. తగ్గుచున్నది. వైద్యుఁ డెందులకు? భవరోగముల కన్నిటికి రామనామమే మహౌషధము కాదా?

రామనామమును నేను స్మరించుకొందును నీవుకూడ స్మరించుకొనుము.

నారా—అయ్యయ్యో! రామనామమును దలఁపనివాఁడను నేనొక్కఁడనే యీభారతదేశమం దున్నాను. ఇదిగో! లెంపలుకొట్టుకొనుచున్నాను. నేను రామనామము నింకఁ బాడుకొందును. రవంత చెప్పుదువా ?

లక్ష్మి—నాథా! నాతోఁగూడఁ బాడెదవా ?

నారా—నీకు డొక్కలోఁ బోటుగా నున్నప్పుడెట్లు పాడఁగలవు ?

లక్ష్మి—తెరవచ్చినప్పుడే బాధకాని లేనప్పు డింటిపనులు చేసికొనుచుండుట లేదా.

పాట.

జయజయ రాఘవ జానకిరామ్—రఘుకులరాఘవ రాజారామ్
రావణసంహార రాఘవరామ్—రఘుకులదీపక రాజారామ్
నీరధిబంధన రాఘవరామ్—మారుతిసేవిత రాజారామ్
దశరథనందన రాఘవరామ్—దానవభంజన రాజారామ్
మునిసవనావన రాఘవరామ్—పురహరపూజిత రాజారామ్
మంగళగుణగణ రాఘవరామ్—మంజులభాషణ రాజారామ్
పతితపావన రాఘవరామ్—భక్తినోసఁగుమా రాజారామ్
జానకిరంజన రాఘవరామ్—జన్మవిభంజన రాజారామ్ ॥ జయ ॥

రవంత నిద్రవచ్చుచున్నది. పండుకొననా ?

నా—పండుకొనుము. అభ్యంతరమేమి? నేను మఱొక్క రామకీర్తనఁ బాడుకొందును. నీరామకీర్తనలపుస్తక మేది ?

లక్ష్మి—నాతలక్రింద నున్నది. తీసికొనుము.

బిలహరి-ఏక.

నా— జయరామ ! జయరామ ! జయజానకీరామ !
జయసర్వగుణధామ ! జయసార్వభౌమ !
జయశుభాకరనామ ! జయవైరిభీమ ! ॥ జయ ॥
ఇక్కడన కక్కడన కెక్కడను గాంచినను
అక్కజంబుగ నుందు వనుచు పెద్దలుపల్క
మ్రొక్కి మ్రొక్కి కనులు మూసుకొని చూచినను
ఎక్కడను గానఁబడ వెళ్లేమనయ్యా. ॥ జయ ॥

(తొట్టిలోఁ పిల్లవాఁ డేడ్చుచున్నాఁడు. అచ్చి యెత్తు కొనును. ఇంకను నేడ్చును.)

నా—నాయనా ! కృష్ణా ! అమ్మ కిప్పుడే నిద్దురపట్టినది. ఏడువకు. అచ్చీ ! ఏడ్పుమానకుండ నున్నాఁడు. నే నెత్తుకొందును. నా చేతి కిమ్ము.

అచ్చి—మీ కెత్తుకొన వచ్చునా ?

నా—(పిల్లవానిని బలవంతముగఁ దీసికొనును) (పిల్లవాఁ డేడ్పుమానకుండును) నాయనా ! నాయనా ! ఊరకుండుము.

(జోకొట్టును.)

అచ్చి—బాబూ ! మీ రెప్పుడైనఁ జనవుచేసికొంటిరా ?

నా—(తనలో) ఈప్రపంచమున నెన్ని సంసారము లున్నవి! ఎందఱో కొడుకులఁ గనుచున్నారు. ఎవ్వఁడైన నావంటిపాపాత్ముఁ డీప్రపంచమున నుండెనా ? మూఁడేండ్లకు మొదటిసారి బిడ్డ నెతుకొన్న తండ్రి మూఁడులోకములలోఁగూడ నేను దక్క వేఱొక్కఁ డేడీ ? వీఁడు పుట్టినపిమ్మట దేశాంతరము పోయితి

ననుకొననా? కారాగృహమం దుంటి నని యనుకొననా? మొద్దులాగున నూరనుండియు, నింటికి వచ్చుచుండియుఁ గూడ నెత్తుకొనకపోయితినే! నాచేతు లేల కాల్పనా? కృష్ణా! తనస్వరూపముచేత నీయమ్మ నాకిచ్చిన యానందముకంటె చంద్రరేఖ యిచ్చిన యానందము ఘనమని భ్రాంతి నొందుటచేత నేను మీయమ్మ నాదరింపలేదుకాని నిన్నేల యాదరింపలేదోయి తండ్రి! నీవు నా కొడుకవే కాదా? కొడుకు లేనివాఁడు లేఁడని యేడ్చుచుండఁగ నున్నవాఁడ నని యేడ్వవలసినదా? నీపై ననురాగము నాకేల లేకుండవలయు? ... యెరచేతనే నన్నియనురాగములు నశించినవి. ... ము సంసారపరిత్యాగమునకుఁ గారణము. ... సంసారపరిత్యాగమునకుఁ గారణమే. చుట్ట ... వాఁడు దానిని బరిత్యజించుట శ్రేయమే. కాని ... వాటుచేసికొని చుట్ట మానినవాఁడు విషయవాంఛాశూన్యుఁడని చెప్పవచ్చునా?

(కృష్ణుఁ డేడ్చును.)

నారా—నాయనా! నీ కేమి కావలయును?

కృష్ణుఁడు—నాకు మాయమ్మ కావలయును.

నారా—మాయమ్మ నీయుదయమునసే మట్టిచేసితిని. నాచేతు లామెకు నమస్కరించుట కక్కఱకు రాలేదు. ఆమెపాదము లొత్తుట కక్కఱకు రాలేదు ఆమె కేవైనఁ బ్రియవస్తువు తెచ్చియిచ్చుట కక్కఱకు రాలేదు. ఆమెతలక్రింద నిప్పుపెట్టి కపాలమోక్షము చేయించుట కక్కఱకు వచ్చినవి. అంతటితో సరిపోయెనా? మీయమ్మను డొక్కలోఁ బొడుచుట కక్కఱకు వచ్చినవి.

అస్త్రిపాపపుఁజేతులు మృదులాంగుఁడవు, నమాయకుఁడవు, దోషగంధశూన్యుఁడవు, బాలుఁడవు. భగవత్సముఁడ వైన ని న్నెత్తుకొనుట కుపయోగపడునా?

కృష్ణ—మామ్మ. మామ్మ. (ఏడ్చును.)

నారా—మామ్మ యిక్కడ లేదు తండ్రీ!

కృష్ణ—మామ్మయొద్దకు నేను బోదును.

నారా—నాయనా! అంతయపశకునపుమాటలాడితి వేమి? నీవు నా కడుపున మఱియొక చిచ్చుపెట్టెదవా? అచ్చీ! నీ వెత్తుకోవే.

(అచ్చి అట్లు చేయుచున్నది.)

లక్ష్మి—(రవంతకలతనిద్దురలో లేచి) అచ్చీ! పిల్లవానిని నాప్రక్క లోఁ బండుకొనఁబెట్టి నీవు జోకొట్టు.

నారా—నేను జోకొట్టెదను. అచ్చీ! ఎందుకైన మంచిది. కుంపటి లో నిప్పుచేసి యుంచుము.

అచ్చి—పోవును.

నారా—(పిల్లవానిని జోకొట్టుచుండును. కొంతసేపటికిఁ బిల్లవాఁడు నిద్రించును.)

(నేపథ్యమున) తలుపు. తలుపు.

నారా—(తలుపునొద్దకు వచ్చి తీసి) నీ వెందులకు వచ్చితివి?

(సోమి ప్రవేశించును.)

సోమి—చంద్రరేఖమ్మగారు మిమ్ము రమ్మన్నారు.

నారా—ఇప్పు డెందుకే?

సోమి—బాబూ! చెంపకు చేరెఁడేసికన్నులు— చిన్నకన్నులా బాబూ! సాయంకాలమువఱకు బాగుగనే యున్నవి. రవంత వేడి చేసిన ట్లున్నదని తల్లితోఁ జెప్పినది. ఎప్పు డాయమ్మ కుదుకేకా దా?

ఎంతసేపు తరవాణి, మజ్జిగ, పంచదార— యీలాగుననే కాదా కాలక్షేపము. సాయంకాలమందు పెసరపప్పు మామిడికాయ పులుసుతోను, కొబ్బెరకాయ పచ్చడితోను బాగుగనే భోజనము చేసినది. లేచి తాంబూలము వేసికొన్నది. "ఈరాత్రి నారాయణరావు లేకపోవుటచే నిల్లు చిన్నఁబోయిన" దని పదే పదే యనుకొన్నది. "పెద్దయామె వెళ్లిపోయినది. ఆమె కేమి ధన్యురా" అన్నది.

నారా—ఈగొడవ యంతయు నెందులకు? నిన్నామె పరామర్శకుఁ బంపించినదా యేమి?

సోమి—అబ్బే! అదికాదు బాబూ! పెద్దనీరుల్లిపాయలకుఁ బంపించినది. సంతలోనికిఁ బోయి తెచ్చితిని. సన్నముగాఁ దరిగి నేతితోనే యుంపు మన్నది. ఆలాగే చేసి దానిలో రవంత పంచదారవేసి యామె కిచ్చితిని. ఆమె తిన్నది. చేసినపాపము చెప్పినఁ బోవునుగాదా? నేను గొంత తింటిని.

నారా—సోమీ! ఈసోదె యంతయు నెందులకు? నీవిచ్చట కెందులకు వచ్చితివి?

సోమి—నేను గూడను గొంత తిని మంచినీరు త్రాఁగినతరువాత 'సోమీ' యని పిలిచినది. 'ఏమమ్మా' యని యంటిని. "కాళ్ళు పట్టవే" యన్నది. కాళ్ళుపట్టుచుండగాఁ బసిసాఫ్గ— నిన్నుఁ దలఁచుకొని కంట నీరుపెట్టుకొన్నది. ఆడివాళ్లకే కన్నులు కొంచెము కాకచేసి యుండుచున్న వేమో యీయేడుపుతో మఱి కొంత మండినవి కాఁబోలు! అప్పు డేమి చేసినదా— 'అమ్మా' యని పిలిచినది.

నారా—త్వరగఁ జెప్పుము. నాకుఁ గొంచెము నిద్రవచ్చుచున్నది.

సోమి—అంతలో నాగమ్మ కఱ్ఱ చేతఁబుచ్చుకొని లోనికి వచ్చినది. “చెందీ! ఎందుకే” యని యడిగినది. “అమ్మా! కన్నులుమండుచున్నవి. ఆమందసమున కెడమప్రక్క నున్న గూటిలో చిన్న సీసలో నేత్రబిందు వున్నది. ఆసీసాలోఁ జుక్కలు నాకంటిలో వేయఁగలవఁటే” యని యడిగినది. “అలాగే- అమ్మా” అని నాగి సీసా తెచ్చి రెండుచుక్క లీకంటిలో రెండుచుక్క లాకంటిలోఁ జప్పున వేసినది. అప్పటికి ఱెప్పలు గట్టిగ మూసికొన్న దేమో యేమియు ననలేదు. ఱెప్పలు రవంతవిడుసరికే గిలగిలకొట్టుకొని యేడ్చినది. “ఏమమ్మా! ఏమమ్మా!” అని నాగి, నేను రేకమ్మను బట్టుకొంటిమి. గిజగిజ తన్నుకొన్నది. ‘మంటమంట’ యని యొక్కటే యేడ్పు. చుట్టుపట్లనున్న సుబ్బిసాని, దానితల్లి తవిటమ్మ— నీ వెఱుఁగవు గనుకనా? ఏది- ఎడమభుజముమీఁదఁ బెద్దదబ్బకాయంత కంతి యున్నమ్మ కొండలు మగవారు— పిడుకలమ్ము శివన్న, పాలశాస్త్రిపట్లపద్దయ్య, యింక నెందఱో వచ్చినారు. పెద్దతీర్థమై పోయినది. కంటిలోఁ జుక్కలువేసిన సీసా యేదో తెమ్మని మద్దెలకూటన్న యడిగి చూచినాఁడు. “ అబ్బే! ఇది నేత్రబిందు సీసాకాదు, తామ్రరమందు సీసా” యని చెప్పినాఁడు. అంతే. కన్నులురెండు నీవు నేను మాటలాడిననంతలోఁ జిల్లులువడిపోయినవి. నాగిసానినిఁ దిట్టనివా రెవ్వరు లేరు.

నారా—నీయిల్లుబంగారముఁ గాను. రెండుముక్కలలోఁ జెప్పవలసిన సంగతి కెంత యుపన్యాసము చెప్పితివే. ఇప్పుడు నేను వచ్చి చేయవలసిన దేమున్నది?

సోమి—బాబూ! మీరనఁగ మొదటినుండియుఁ బ్రాణముకాదా!. మి మ్మొక్కసారి చూడవలయు నని.

నారా—ఎంత ప్రాణపదమైన వాఁడనైనను గన్నులు లేక నన్నెట్లు చూడఁగలవు?

సోమి—. నాకు—దిక్కుమాలినపూర్వపుటలవాటుచేత నామాట వచ్చినది. ఈకన్ను లిఁక బాగుపడవు కాఁబోలు నేమి?

నారా—నాగి యని, నేత్రబిందు వని, తామరమం దని యివి యన్నియుఁ బైకిఁ దోఁచుపడిన వేడబములు. పతివ్రతాతిలకమైన నా భార్యను దిట్టుటచేతనే యీశిక్ష యామెకు భగవంతుఁడు చేసినాఁ డని చెప్పుము. నేను రాను. చప్పునఁ బో.

సోమి—బాబూ! ఏదైన సీయవా?

నారా—ఇదిగో. తీసికో (నాల్గుడబ్బు లిచ్చును.)

(సోమి పోవును.)

నారా—మగనాలిని దిట్టిన వేశ్యకుఁ గన్నులుపోయినప్పుడు కొట్టిననా కంతకంటె శిక్ష భగవంతుఁడు చేయవలసినదేకదా! నాకుఁ గన్నులే కాదు— కాళులే కాదు—చేతులే కాదు—చెవులేకాదు— అన్నియుఁ బోవలసినదే! పోక మానునా? నావంతు రానైయున్నది. దానికొఱకే సంతోషముతో నిరీక్షించుచున్నాను. లోకమున కంతకు నాశిక్ష ప్రకటింపఁబడవలయును. అప్పుడు కాని పతివ్రతలమహిమ ప్రపంచమునకు వెల్లడికాదు. అప్పుడు కాని వేశ్యల నుంచుకొని భార్యలను బాధించు ముండకొడుకులు లెంపలువైచుకొని, సంసారములోఁబడి సత్పు [illegible] లోకకల్యాణమునకు దుష్టులలోఁ గొందఱకు [illegible] తప్పదు. నాబ్రదుకు వృథయై పోయె నని విచారించుచుంటిని.

తుదకిగా నావలన లోకము నీతినేర్చుకొన్నయెడల నేను సఫలమైన బ్రతుకు బ్రతికితినని రవంత సంతసింపఁగల్గుదును. భగవంతుఁడా! త్వరగ శిక్షింపుము. చేసినతప్పుపని యెన్నఁడు వ్యర్థమై పోదు. తాత్కాలికముగఁ గొంత పరిసిపాటిపోయినట్లు కనఁబడినను, ద్విగుణీకృతధాటితో ఫలించునుగాని మానదు. మననోటినుండి వెలువడిన యొక్కస్వల్పమైన తిట్టయినను తిరిగి మనపై నెప్పుడో విఱుచుకొనిపడును కాని మానదు. చేతు లున్నప్పుడు కొట్ట బుద్ధిపుట్టును. కాళు లున్నప్పుడు తన్న బుద్ధిపుట్టును. నోరున్నప్పుడు తిట్ట బుద్ధిపుట్టును. అందుచేతఁ గనులు, గాళులు, నోరుకూడఁ బడిపోవలయు నని దొందరపడుచున్నాను. అన్నిటికంటె బుద్ధిపోయి స్థాణువునైనయెడల మఱింత మంచిదేమో. అహల్య కట్టిశిక్ష యేకదా భర్తవలనఁ గలిగినది. ఆశ్రీరామచంద్రమూర్తిపాదధూళిచే నామె పవిత్రయైనట్లు నేనుకూడ నాశిక్ష ననుభవించి యాశ్రీరామమూర్తికటాక్షమునవే సద్గతినొందఁగలనేమో—

లక్ష్మి—రామ రామ రామా రామ రామ రామా (కేకలు పెట్టుచున్నది.)

నా—తిరిగి తెరవచ్చినదా! అయ్యయ్యో- అచ్చీ! కుంపటిని దీసికొనిరా.

అచ్చి—(తీసికొనివచ్చును.)

లక్ష్మి—కాచినదాఁక వ్యవధి లేదు. మంచముక్రిందఁ బెట్టు. నానాయనను నావీపువైపునఁ బండుకొనఁజేయుము. కుడివైపుడొక్కక్రిందఁ బెట్టుము. (అచ్చి అట్లుచేయును.)

నా—శ్రీత నాలిస్యము చేయుచఁదగను. పోయి వైద్యునిఁ బిల్తును.

లక్ష్మి—రామరామా! (గిజగిజ కొట్టుకొనును.) నాథా ! వైద్యుఁడు వలదు.

నా—ఎందుచేత ?

లక్ష్మి—(అప) నాథా! నీవు కఱ్ఱతోఁ బొడుచుటచేత నాకడుపుపగిలిన దనియో, యందులోఁ బుండుపడిన దనియో యేదో వెఱ్ఱి మొఱ్ఱిగ వైద్యుఁడు చెప్పునెడల, నామాట నమ్మి నిన్నుఁ గారాగృహమునఁ బెట్టి యధికారులు శిక్షింతు రని నాకు భయముగా నున్నది. అందుచేత వలదు.

నా—ఓసివెఱ్ఱిదానా ! ఇందులకా భయపడుచుంటివి ? ఇందులకా విచారించుచుంటివి ? విచార మొందవలసినవారిఁగూర్చి విచారింపకపోవుట యెంతతప్పో—విచార మొందఁగూడనివారిఁగూర్చి విచారించుట యంతతప్పేసుమా. నీకు నిమ్మళముగా నున్న పిమ్మట నేనే యధికారులయొద్దకుఁ బోయి, నాతప్పొప్పుకొని, నన్ను శిక్షింపుఁ డని ప్రార్థించి నాచేతులతో—నిన్నుఁ బొడిచిన నాచేతులతో—నాకాళ్లకు సంకెలలు మహోత్సాహమునఁ దగిలించుకొందును.

లక్ష్మి—నాథా ! నాకు నిమ్మళించు నను నాశ నీకున్నదా ?

నా—ఆఁ ! ఆఁ ! నీకు సందేహముగా నున్నదా ? నేను దప్పకుండ వైద్యునిఁ బిల్తును.

లక్ష్మి—నాథా ! నే నొకవేళ దేహము చాలించునెడల నధికారుల వలన నీ కడికూడఁ గల్గునేమో ?

నా—లక్ష్మి ! ప్రాణప్రియా! నీవు మరణించినతరువాత నాకుఁ బచ్చునపయా విచారించుచుంటివి ? నాదోషమునకు హద్దు లేనట్లె నీప్రేమమునకుఁగూడ హద్దులేదే- దోషావతారమును నేను,

సుకృతావతారము నీవు. అట్టినిన్ను నాకు భగవంతుఁడు కూర్చినాఁడే— ఎందులకో యెఱుఁగుదువా? నన్నుఁబట్టి నిన్ను బాధించుటకుఁ గాదు. నిన్నుఁబట్టి నన్ను బాగుపఱచుట కిట్లు చేసినాఁడేమో— భగవంతునిచేత లవిజ్ఞాతములు. సర్వసాధారణముగాఁ బ్రపంచమందున్న భార్యాభర్త లందఱు నన్యోన్యవ్యత్యస్తప్రకృతులు గలవారై యుందురు కాని యిమిడికగ నణఁకిపోవు ప్రకృతులు గలవారై యుండరు. భార్యగుణము భర్తకు దిద్దుపాటుగా నుండును. భర్తగుణము భార్యకు దిద్దుపాటుగా నుండును. అట్టిదిద్దుపాటు లుండినఁగాని యిద్దఱు కూడ బాగుపడనేరరు. అన్యోన్యప్రకృతు లిట్లు బాగుపడుటయే భగవంతునిసంకల్పము. అట్టివ్యత్యస్తప్రకృతులకే కాని యన్యోన్యానురాగము కలుగదు. లక్ష్మీ! లక్ష్మీ! నిద్రించుచున్నది. తెర తగ్గినది. ఇప్పుడే పోయి వైద్యునిఁ దెచ్చెదను. అచ్చీ! నేను వైద్యునింటికిఁ బోవుదును. నీవు మెలకువగా నుందువు కాదా?

అచ్చి—కోడికునుకే కాని నిద్ర యెన్నఁడు రాదు బాబూ!

(నారాయణరావు నిష్క్రమించును.)

లక్ష్మి—(లేచి) అచ్చీ! ఆయన యేరీ?

అచ్చి—వైద్యునింటికి వెళ్ళినాడు.

లక్ష్మి—పిల్లవానికి వేడిమి హెచ్చుగా నున్నది. కావున కుంపటి మంచముక్రిందనుండి తీసివేయుము.

అచ్చి—(లక్ష్మివైపుతీయు మని యామెయభిప్రాయమై యుండఁగా వెనుకవైపు పండుకొన్న పిల్లవానివైపునకుఁ గుంపటి లాఁగి, మంచముపట్టెకు దిగువుగా నుంచును. పిల్లవాఁడు నిద్రలో

దొరలి కుంపటిలోఁ బడిపోయి కేకలు వేయును.)

లక్ష్మి—(ఉలికిపడి లేచి) నాయనా! నాయనా! (లేచును.)

(అచ్చి నిద్రించుచుండును.)

లక్ష్మి—అయ్యో! నాతండ్రి కాలిపోయినాఁడే-(పిల్లవాని నొడిలోఁ బెట్టుకొని) అచ్చీ! లేవవేమి?

అచ్చి—(లేచి) అమ్మా! ఏమి?

లక్ష్మి—పిల్లవాఁ డావైపు పండుకొనినప్పుడు కుంపటి రవంతయైనను జరుగ లాఁగలేకపోయినావా?

కృష్ణు—(ఏడ్చుచున్నాఁడు.)

లక్ష్మి—అయ్యయ్యో! పిల్లవానిమెడక్రిందఁ గాలిపోయినదే- దీనికి మందేమి?

అచ్చి—అమ్మా! సిరా మంచిదమ్మా. తెత్తును. (తెచ్చి రాచును.)

లక్ష్మి—నాయనా! నాయనా! నీ కెంత బాధగానున్నదోయి తండ్రీ! (ఏడ్చును.) నాతండ్రీ! నే నేమి చేయుదునురా—ఇంటిలోఁ బెద్దదిక్కైన మీయమ్మ వెళ్ళిపోయినది. నేను దుస్సాధమైన రోగముతోఁ బడియున్నాను. నీతండ్రిమాత్రము నాపుణ్యావశమున నింటికి వచ్చినా రని సంతోషించుచుండగా నీ విట్లయితివేల? పరాత్పరుఁడా! నాబ్రదుకున నొక్కనిముసమైన సుఖమీయవా? (పిల్లవాని నడ్డాలలోఁ బెట్టుకొని, వీలగునంత వఱకు చేతుల జోడించుకొని నిలువఁబడి) అచ్చీ! శ్రీరామచంద్రమూర్తిని ప్రార్థించుకొందును. నేను దూలుదునేమో—దగ్గఱ నుండుము. ఈశూల నన్నింత వేగముగా నింత నీరసపెట్టిన దేమో. రామా రామా! రామచంద్రప్రభూ! చచ్చిపోయిన బ్రాహ్మణబాలకునకుఁ బ్రాణమిచ్చి రక్షించితివి కావా

తండ్రీ! కాలినబాలకుని రక్షింపలేవా! తండ్రి! నన్ను రక్షింపు మని నేను గోరను. నన్ను సీతాసాన్నిధ్యమున కొంత శీఘ్రముగాఁ దీసికొనిపోదువో యంత యెక్కువగా సంతోషింతును. అంతమహాదృష్టవతినిగా భావించుకొందును. నీదయవలననే నాభర్తకుఁ దిక్కు తిరిగినది. ఆతఁ డీకొడుకును బెట్టుకొని నాతోం డ్లీసంసారమున సుఖించునట్లు కటాక్షింపుము. నన్నిదివఱ కాతఁడు తిరస్కరించినపాపమున కాతనికి యథార్థమగు పశ్చాత్తాపము కలిగినది. కావున నాతని నింక శిక్షింపక రక్షింపుము. పుత్రుఁడు చెడిపోవుచున్నాఁడే యని రోషమున మాయత్తగారు నాభర్త నన్న కఠినమైనవాక్యముల కామెను క్షమింపుము. పునర్జన్మరహితమైన శాశ్వతపదవి నాపతివ్రతాశిరోమణి కీయఁ బ్రార్థింతును. నాభర్తయెదుటనే నన్ను దూషించిపలికిన యావేశ్యను క్షమింపుము. ఓతండ్రీ! క్షమింపుము. నే నెవరికైనబాధ నిచ్చియుండిన యెడల నన్ను శిక్షింపుము కాని నన్ను బాధించినవారిని మాత్రము శిక్షింపకుము తండ్రీ! దీనదయాళూ! ఆర్తత్రాణపరాయణా! శ్రీరామచంద్రప్రభూ! నీవు భగవంతుఁడ వని యెఱిఁగియున్నను, నాభర్తను బూజించినతరువాతనే నిన్ను బూజించితిని గాని యన్యథా యాచరింపలే దని నీవెఱుఁగుదువు. ఆతఁడు సన్మార్గవర్తి యగుటకే నే నాతనితోఁ గష్టపడితిని. నాకష్టము గట్టెక్కినది. నే నింక నిట నుండవలసిన పని లేదు. నేను నీపాదారవిందకీర్తన మొనర్చుకొనుచుఁ బైలోకమున నుండుదును. అదిగాక—

నా—(ప్రవేశించి) ఏమీ! పిల్లవాని నట్లు చేతిలోఁ బెట్టుకొని

ప్రయొక్కుచున్నా వేమి ?

లక్ష్మమ్మ—పిల్లవాఁడు కుంపటిలోఁ బడినాఁడు. వీపుపైఁ గాలినది.

నా—అయ్యో ! అయ్యో ! (గుండెలపైఁ గొట్టుకొనుచు) నా తండ్రీ! నీవు నిప్పులలోఁ బడితివా? నా తండ్రీ! ఎట్లు పడెను? అచ్చీ! నీవు భద్రముగా నుండుమని చెప్పలేదఁటే.

లక్ష్మమ్మ—మనకర్మమున కది యేమి చేయఁగలదు?

నా—ఇప్పుడు నే నేమి చేయవలసినది? ఏమి యీకష్టములు! ఒక్క తల్లిపోయినప్పుడే మనసు కలఁతపడిపోవునే. ఒక్క భార్యకు జబ్బుగా నున్నప్పుడే మతి చెడిపోవునే. ఈ రెండుకష్టములతో మతిపోయి యేడ్చుచుండఁగా కన్నకొడుకు నిప్పులలోఁ బడెనా? ఏమి యీ యుపద్రవము! ఏమి యీ మహోత్పాతము! అయ్యో! ప్రపంచమంతయు మునిఁగిపోయినట్లయినదే! ప్రళయము వచ్చినట్లయినదే! ఆహాహా! వైద్యుఁ డెప్పుడుఁ గూడఁ బలికినాఁడు కాఁడు. తెల్లవాఱివచ్చెద నని యొక్కఁ డన్నాఁడు. లక్ష్మమ్మ! ఈపిల్లవాని నేమిచేయుదును. ధర్మవైద్యశాలకుఁ దీసికొనిపోయి యక్కడఁ జికిత్స చేయింతును. ఆ శాల తలుపు లెప్పుడు తీసియుండును. అందులోని వైద్యులు మన యింటికి రారు కావున బిడ్డ నక్కడకుఁ దీసికొనిపోవలసియున్నది. లక్ష్మమ్మ! నీ కెట్లున్నది? నీకుఁ దెర తిరిగిరాలేదుకదా?

లక్ష్మమ్మ—తా లేదు. పిల్లవానిని దీసికొనిపొండు. నాకు నీరసముగా నున్నది. కాని మీరు వచ్చినదాఁక భయము లేదనుకొందును.

నా—అచ్చీ! ఈసారియైన భద్రముగా నుండెదవా? ఆమెను బట్టుకొని దగ్గఱఁ గూరుచుండుము. బిడ్డ నిచ్చెదవా?

లక్ష్మమ్మ—తీసికొనుము. (ఇచ్చును.) నాథా! మఱియొకసారి నా చేతు

అలాఁ బెట్టుఁడు. ముద్దుపెట్టుకొందును. (ముద్దుపెట్టుకొనును) (తనలో) ఇదియేమి కపటపుముద్దు గాదుగదా. (ప్రకా) తీసికొంపోతా?

నా—ఏమిసందేహింతువు.

లక్ష్మి—మీరిట వచ్చులోపల నాకుఁ బ్రమాదము సంభవించునెడల మీరు, కొడుకుకూడ నాయొద్ద నుండకపోవుట తటస్థించునేమో ?

నా—అయ్యో ! అయ్యో ! అటులైన నిన్ను విడిచిపెట్టి యెట్లు వెళ్లఁగలను.

లక్ష్మి—వెళ్లకపోవునెడలఁ బిల్లవానిమాట యేమికావలయును ? నేను పెద్దదానను. నామాట యెటులైనను చింతలేదు. నా తెండ్లు బ్రదుకవలసిన బిడ్డమాట చూచుకోవలయును. ఎటు వచ్చినను, మీతల్లి యవసానసమయమున మీరు తల్లియొద్ద లేనట్లే నాయవసానసమయమునఁ గొడుకు నాయొద్ద లేకపోవునేమో యని భయముగా నున్నది.

నా—అటులైన నేను చెప్పుమాట విను. నిన్ను నే నెత్తుకొనెదను. అచ్చి బిడ్డ నెత్తుకొని నాతోడ వచ్చును. మనమందఱము గలసి వైద్యశాలకుఁ బోవుదము.

లక్ష్మి—ఇంటిలోఁ గాకుండ నడుమదారిలోఁ జావవలసివచ్చునేమో-ఏమియు వలదు. ఏమైన నగును. బిడ్డను తీసికొని వైద్యశాలకుఁ బొండు.

నా—పోవుదును. అచ్చీ ! భద్రముగా నుండుము. లక్ష్మి ! బిడ్డ నొకసారి చూచుకొనుము.

లక్ష్మి—ఇఁక నట్టెవెఱ్ఱిపడుట తగదు. చూచితిని.

(నారాయణరావు బిడ్డతోఁ బోవును.)

లక్ష్మి—అచ్చీ! కుంపటిలో నిప్పున్నదేమో చూడు.

అచ్చి—ఉన్నది.

లక్ష్మి—శూలాల వచ్చుచున్నది. కుంపటి డొక్కకిందఁ బెట్టుము.

అచ్చి—(పెట్టుచున్నది.)

లక్ష్మి—రామరామరామా (గిజగిజకొట్టుకొనుచున్నది.) అచ్చీ! అచ్చీ! అక్కడ నున్నావు కాదా? ఎక్కడకుఁ బోకుము.

అచ్చి—ఎక్కడకును బోనమ్మా.

లక్ష్మి—రామా రామా రామా చాపక్రిందఁ బఱుపుము. త్వరగ. రామరామా—పఱచితివా—నేను దొరలి చాపపైఁ బడునప్పుడు నన్ను ముట్టుకొనకుము. (దొరలి చాపపైఁబడి) రామ రామా!

అచ్చి—అమ్మా! అమ్మా! వెడలిపోయితివా? ఎంతమంచిదానవు తల్లీ! దూరమున నుండియే నీపాదములకు [మొక్కుచున్నాను. అయ్యో! అయ్యో! (గట్టిగ నేడ్చును.)

(నరసయ్య ప్రవేశించును.)

నర—ఏమి? ఏమి?

అచ్చి—అమ్మగారికిఁ బ్రాణముపోయినది.

నర—(చేయిచూచి) ఇంకను బ్రాణమున్నది. తులసితీర్థ మిచ్చెదను. (లోనికిఁ బోయి తీసికొనివచ్చి యిచ్చును.) అచ్చీ! నే నిక్కడ నుందును. మీ బాబుగారిని దానియింటికిఁ బోయి తీసికొనిరా.

అచ్చి—బిడ్డ కుంపటిలోఁ బడుటచేత నాశఁడు బిడ్డను దీసికొని వైద్య

శాలకుఁ బోయినాఁడు.

సత—నీవు పోయి యాతనినిఁ దీసికొని రాఁగలవా ?

అచ్చి—నాయనా ! చీఁకటిలో వెళ్ళలేను.

నల—నీ విచ్చటనే యుండుము. నేను బోయి యాతనిఁ దీసికొని వత్తును.

అచ్చి—అక్కఱ లేదు. ఆతఁడే పరుగెత్తుకొని వచ్చుచున్నాఁడు.

నా—(బిడ్డశాలఁ బ్రవేశించి) లక్ష్మీ! లక్ష్మీ! పిల్లవాఁడు బ్రతుకఁ డని వైద్యుఁడు చెప్పినాఁడు. ఆ! ఆ! హా లక్ష్మీ! (పిల్లవానిని గుండె కద్దుకొని నేలఁ గూలును.)

అచ్చి—(నారాయణరావుబిడ్డను నిమ్మళముగఁ దీసికొని యేడ్చును.)

నర—నారాయణరావూ! నీభార్య యింకను బ్రదికియున్నది. ఉన్నది. లే.

నా—ఏదీ ! ఏదీ ! ఉన్నదా ! ఉన్నదా ! లేచినదా ! ఏదీ ! నాకుఁ గన్నులు కనఁబడకుండనున్నవి. ఎక్కడ ! ఎక్కడ !

నర—నారాయణరావూ ! తొందరపడకు. అతివిచారమున మునుఁగఁ దగదు. మనస్సు చెడిపోవుట చేతఁ గన్నులు కనఁబడకున్నవి. (కన్నులను నీళ్ళరాచి) ఇదిగో ! చూడు. నీభార్య.

నారా—ఇంతకు క్రింతఁ బండుకొన్న దేమి ? లేవవా ? నాబిడ్డఁ డేఁడీ ! అచ్చీ ! వానిని నాచేతి కిమ్ము. లక్ష్మీ ! ఇదిగో నీబిడ్డ. చూచుకో- ముట్టుకో- ముద్దుఁబెట్టుకో- పాలిచ్చి ప్రక్కలోఁ బండఁబెట్టుకో- ఏది- ఏది- మాటలాడవేమి- లక్ష్మీ—

(అని గావు కేకలు వైచును.)

నర—బిడ్డఁడు బ్రదికియే యున్నాఁడు— తల్లియు బ్రదికియే యున్నది. ఎందుల కీదుఃఖము ?

నారా—నాబిడ్డఁ డింక బ్రదికియున్నాఁడా ! ఇట్లని నీ వేమని చెప్పితివో జ్ఞప్తిలేదా— బిడ్డకు చిత్రాంగునకుఁ బట్టాభిషేకముఁ గాని తల్లి చచ్చిపోవునెడల నాకొకమాటయైన నాకు బోధించితివి కాదా ? ఇదిగో. నీబిడ్డకొఱకై నను దుఃఖింపఁ జేయుము. నేను బిడ్డను బట్టుకొందును—నాకట్టియోగము నాపాపముచే సిద్ధింపు లేదు. నాకుత్తమాధ్వానికి సిద్ధించుచున్నది. నాయనా ! శక్తీ ! 'నేను మామ్మగారియొద్దకు వెళ్ళెద ' నని యడిగితివి కాదా ? వెళ్లెదువా ! మీయమ్మనుగూడఁ దీసికొని పోవుదువా ? తండ్రినైన నన్ను వదలిపెట్టెదవా ? అంతయు మునుపోలదు_ లక్ష్మీ ! నీయత్త నాతో నేమనెనో జ్ఞప్తియున్నదా ? " ఇదిగో! ఈమహాతేజస్విని ! ఈపతివ్రతామణి ! నోటిమాట నైన నెఱుఁగని వట్టిగోల ! సంతతభగవచ్చింతాపరాయణ! ఆమెకాళ్లపైఁ బడి, నేను మహాద్రోహిని, నన్నుఁ గటాక్షింపు ' మని వేఁడ్వు మన లేదా ? ఇంతకంటె నాకుఁ బ్రపంచమునఁ జేయవలసిన ముఖ్యకార్య మేది ? ఇదిగో బట్ట మెడఁ జుట్టుకొనుచున్నాను. ఇదిగో నీకు సాష్టాంగపడుచున్నాను.

" నధర్మనిష్ఠోస్మి నచాత్మవేదీ
నభక్తిమాన్ త్వచ్చరణారవిందే
అకించనోనన్యగతిశ్శరణ్య
స్త్వత్పాదమూలం శరణం ప్రపద్యే. "

నాదుష్టవృత్తిని ఖండించినదానవు—నాకు బుద్ధి నిచ్చినదానవు—నాకు భక్తి నొసంగినదానవు—నీవు ! నీవే నాకు దైవము—నాచరిత్రి లోకమునఁ బ్రకటింపఁబడవలసియున్నది. నరేస

అయ్యా! దొడ్డిలోనికిఁ బోయి రుబ్బురోటిక్రింద రూపాయల మూట యున్నది. తీసికొనిరా—

(నరసయ్య పోవును.)

నా—అయ్యో! ఎగుపులు వచ్చుచున్నవి. ప్రాణప్రియా! వెడలిపోయితివా! ఒక్కయడుగులో నేనును వత్తును.

(నరసయ్య మూటతోఁ బ్రవేశించును.)

నా—నరసయ్యా! నావంశ మంత నగుచున్నది. ఆరూపాయలలో నీకుఁ దోఁచినన్ని రూపాయలు మాయుత్తరక్రియలక్రింద వ్యయము నర్చుము. మిగిలినరూపాయలతో మాయింటియొద్ద నొక్కపాతిస్తంభము కట్టింపుము. దానిపై నాభార్య లక్ష్మివిగ్రహము జెక్కింపుము. దానిక్రింద "నారాయణుఁడను దుర్మార్గుఁడు వేశ్యాలంపటుఁడై, పతివ్రతాతిలకమైన భార్యను డొక్కలోఁ బొడిచి చంపినాఁ డని తాటికాయలంత యక్షరములతో శిలాశాసనము చేయింతువా? చేయింపక తప్పదు. కవుల వ్రాఁతలకంటె పాతిమీఁదివ్రాఁతలు శాశ్వతము లని నానమ్మకము. నాయనా! కృష్ణా! నీయమ్మ వెడలిపోయినది. ని న్నెత్తుకొనుటకు నే నింక నున్నాను. హా! నీవుకూడ వెడలిపోయితివా! ఇఁక నాపాలిటి కృష్ణుఁడే లేఁడా? నే నింక నెందులకు- లక్ష్మీ! వచ్చుచున్నాను-రామరామా! (అఱచి నేలపైఁ బడి మరణించును.)

నర—రామరామరామా! ఈతఁడుకూడ మరణించినాఁడే! నోటి వెంట రక్తము కాఱుచున్నది. గుండె పగిలిపోయినదికాఁబోలు. ఆహా! మహామారి యింటఁ బ్రవేశించినను నింత సంఘమరణ మింతశీఘ్రముగ నొనర్పలేదే! భాగ్యహీనతయే పదునాల్గొ

మారులంత ప్రబలమైనది. రామరాజా ! ఎంతకష్టాంతమైన చిత్రమును జూచితిని.

ధరణి ఈతిబాధలు లేక తనరుఁగాక
ప్రజలయన్యోన్యవైరముల్ పాయుఁగాక
నీతిపాలనమున రాజు నెగడుఁగాక
కవిత రాజపోషణమునఁ గ్రాలుఁగాక !

అను భరతవాక్యమున కవకాశము లేదుగదా !

ఇది పంచమాంకము

సంపూర్ణము

శ్రీ శ్రీ శ్రీ.